జయహో జగన్మాత



నరసన్నపేటలో జై దుర్గాభవానీ ట్యాక్సీ యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహం



శ్రీకాకుళం నగరంలోని ముత్యాలమ్మతల్లి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన మండపం

జిల్లావ్యాప్తంగా గురువారం దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. పలు ప్రాంతాల్లో ఆలయాలు, పీఠాలు, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపాల్లో దుర్గామాత విగ్రహాలను కొలువుతీర్చి పూజలు నిర్వహించారు. తొలిరోజు అమ్మవారు బాలాత్రిపురసుందరిగా దర్శనమిచ్చారు. మహిళలు లలితా సహస్రనామ పారాయణం చేశారు. – న్యూస్‌టుడే, నరసన్నపేట, శ్రీకాకుళం సాంస్కృతికం

భక్తజన సంద్రం..!



కోటబొమ్మాళి వీధులన్నీ, గురువారం కొత్తమ్మతల్లి శరణుఘోషతో మారుమోగాయి. రాష్ట్రంలోని పలు ప్రాంతాలు, ఉత్తరాంధ్ర జిల్లాలు, ఒడిశా నుంచి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు. వేకువజాము నుంచే ఆలయంలో క్యూలైన్లన్నీ కిటకిటలాడాయి. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు వరుసలో నిల్చుని అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు. పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రముఖులు గుడికి వచ్చారు. గ్రామంలో డప్పు వాయిద్యాలు, మేళతాళాలు, పగటి వేషధారణలు, సంప్రదాయ నృత్యాలతో ఎక్కడ చూసినా ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. కోరిన కోర్కెలు తీర్చే కొత్తమ్మతల్లి జాతర మూడో రోజు చివరి ఘట్టంతో వైభవంగా ముగిసింది. ఈ సందర్భంగా భారీగా బాణసంచా కాల్చారు.

– న్యూస్‌టుడే, కోటబొమ్మాళి

కనుల పండువగా ఘటాల ఊరేగింపు

కొత్తమ్మతల్లి జాతర సందర్భంగా తొలి రోజు మంగళవారం అంతరాలయంలో పూజల అనంతరం కమ్మకట్టు చిన్నఅప్పలనాయుడు ఇంటికి వెళ్లిన జంగిడి పెద్దఎత్తున ఘటాలతో తిరిగి ఆలయానికి చేరుకుంది. ప్రత్యేక పోలీసు బలగాలు, రోప్ పార్టీ బందోబస్తు మధ్య ఈ ఘట్టం కనుల పండువగా సాగింది. ముగ్గురాటలతో వేల మంది మహిళలు వెంట వచ్చారు.

వైభవంగా ముగిసిన కొత్తమ్మతల్లి జాతర




ఆలయం వద్ద భక్తుల రద్దీ



అమ్మా చల్లగా చూడు..

క్యూలైన్లలో భక్తులు ఎక్కువ సేపు నిరీక్షించకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవడంతో దర్శన ప్రక్రియ సజావుగా జరిగింది. ఆలయం నుంచి బయటకు వచ్చే ప్రాంతాల్లో ప్రసాదం, మజ్జిగ పంపిణీ చేశారు. కొత్తపేటలోని ఆలయం వద్ద కూడా భక్తులకు ప్రసాద వితరణ జరిగింది.



ఘటాలతో తరలివస్తున్న గ్రామస్థులు



భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

ఆలయాల్లో మెరుగైన వసతుల కల్పనకు చర్యలు: అచ్చెన్న

రాష్ట్రవ్యాప్తంగా ఆలయాల్లో భక్తులకు మెరుగైన వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. కోటబొమ్మాళిలో కొత్తమ్మతల్లి ఉత్సవాలకు వచ్చిన భక్తులకు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. ఆధ్యాత్మికతతో వచ్చే ప్రతి భక్తుడు సంతృప్తితో తిరిగి వెళ్లాలన్నదే తమ లక్ష్యమని పునరుద్ఘాటించారు. అనంతరం వివిధ వంటకాలను ఆయన సోదరుడు హరివరప్రసాదరావుతో కలిసి రుచి చూశారు. భోజనం చేస్తున్న భక్తుల వద్దకు వెళ్లి ఏర్పాట్లు, ఆహార పదార్థాలు ఎలా ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. జాతర సందర్భంగా ఆలయాన్ని బెంగళూరు, కోల్‌కతా, ఇతర ప్రాంతాల పూలతో అలంకరించడానికి ముందుకొచ్చిన పెద్దబాబు (విశాఖపట్నం)ను అభినందించారు. వారి వెంట తెదేపా మండల అధ్యక్షుడు రమేష్, నేతలు విజయలక్ష్మి, అజయ్, గోవిందరావు, శ్రీను, కామేశ్వరరావు, వెంకప్ప తదితరులు ఉన్నారు.



అంతరాలయం ముందు..

అన్ని రంగాల్లో ప్రగతి సాధించడమే లక్ష్యం

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: జిల్లాలోని అన్ని రంగాల్లో ప్రగతి సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం స్వర్ణాంధ్ర-2047 ప్రణాళిక రూపకల్పనపై సూచనలు చేసేందుకు, అభిప్రాయాల సేకరణకు కార్యశాల నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని సువిశాలమైన తీర ప్రాంత అభివృద్ధితో పాటు పరిశ్రమలు స్థాపించి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని చెప్పారు. వ్యవసాయం, ఉద్యాన పంటల సాగుపై పలువురు రైతులు వారి అభిప్రాయాలను వ్యక్తం చేశారు. పలాసకు చెందిన ఓ రైతు మాట్లాడుతూ.. తాను బెంగళూరు నుంచి ఓ బృందాన్ని రప్పించి నూతన పద్ధతులతో పంటలు పండిస్తున్నట్లు చెప్పారు. ఎకరాకు మూడు క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తోందన్నారు. యాంత్రీకరణ సాయంతో సాగు చేస్తే తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందవచ్చని.. జిల్లాలోని ఇతర రైతులూ నూతన పద్ధతులను అనుసరించాలని కలెక్టర్ సూచించారు. జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, జిల్లా ముఖ్యప్రణాళికాధికారి లక్ష్మీప్రసన్న, పరిశ్రమల శాఖ జీఎం ఉమామహేశ్వరరావు, ఏపీఎంఐపీ డీడీ శ్రీనివాసరావు, ఉద్యాన శాఖ ఏడీ ప్రసాదరావు, మత్స్య శాఖ జిల్లా అధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, చిత్రంలో ఇతర అధికారులు

కూలే వరకు పట్టించుకోరా..?

- శిథిలావస్థకు చేరిన కల్వర్టులు
- మరమ్మతులు చేపట్టకపోతే ముప్పే

గ్రామీణ ప్రాంతాల్లో ఏళ్ల కిందట నిర్మించిన కల్వర్టులు దెబ్బతిని ప్రమాదకరంగా మారాయి. నిర్వహణ పట్టించుకోకపోవడంతో చాలావరకు శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. కొన్నిచోట్ల పెచ్చులు ఊడి.. తుప్పు పట్టిన చువ్వలు బయటకు కనిపిస్తున్నాయి. ఆయా మార్గాల్లో ప్రయాణిస్తున్న వాహనదారులు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళనలకు గురవుతున్నారు. ఇటీవల కంచిలి మండలం నారాయణబట్టి వద్ద ఆర్‌అండ్‌బీ శాఖ పర్యవేక్షణలో ఉన్న కల్వర్టు కూలిపోయింది. 15 పంచాయతీల పరిధిలో గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు. ఇచ్ఛాపురం ఎమ్మెల్యే అశోక్ చొరవతో ఉన్నతాధికారులు తాత్కాలిక మరమ్మతులు చేపట్టడంతో ప్రస్తుతానికి సమస్య పరిష్కారమైంది. ప్రమాదకరంగా ఉన్న కల్వర్టుల పరిస్థితిపై 'ఈనాడు' పరిశీలన కథనం.

ఈనాడు డిజిటల్ శ్రీకాకుళం, న్యూస్‌టుడే, కంచిలి, సరుబుజ్జిలి, బూర్జ, నరసన్నపేట గ్రామీణం



ఈనాడు న్యూస్‌టుడే పరిశీలన

తెదేపా హయాంలో వంతెనలు, కల్వర్టుల మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయి. వైకాపా ప్రభుత్వం ఆయా పనులను గాలికొదిలేసింది. గత ఐదేళ్లలో అధికారులు ప్రమాదకరంగా ఉన్న వాటికి సంబంధించి ప్రతిపాదనలు పంపినా పట్టించుకున్న దాఖలాలు లేవు.

నిర్వహణ అధ్వానం

సరుబుజ్జిలి మండలం అలికాం-బత్తిలి రోడ్డులో నక్కలపేట, షలంత్రి, సవలాపురం, బప్పడం గ్రామాల కూడళ్ల వద్ద కల్వర్టులు పనికి రాని మొక్కలతో నిండిపోయాయి. చాలా వరకు పెచ్చులూడి శిథిలావస్థకు చేరుకున్నాయి.

రక్షణ గోడలు శిథిలం



బూర్జ మండలం నారాయణపురం వద్ద నారాయణపురం ఆనకట్ట ఎడమ ప్రధాన కాలువపై దశాబ్దాల కిందట నిర్మించిన వంతెన రక్షణ గోడలు శిథిలమయ్యాయి. దానిపై గుంతలు ఏర్పడటంతో ఎప్పుడు కూలుతుందోనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఇది కూలితే కొల్లివలస, చీడివలస, లంకాం, కాలపర్తి, సుమారు 50 గ్రామాలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది.

తాత్కాలిక పనులతో సరి..



కంచిలి మండలం డోలగోవిందపురం-పోలేరు మార్గంలో ఓ కల్వర్టు కూలేందుకు సిద్ధంగా ఉంది. పోలేరు గ్రామం వద్ద గోవిందసాగరం నీరు పారే కాలువపై కల్వర్టు ఇప్పటికే కూలడంతో దానిపై మట్టి పేరుకుపోయింది. దీని మీదుగా వరద నీరు పారుతుంటుంది. జలంత్రకోట-శాసనాం మార్గంలో రెండు కల్వర్టులు దెబ్బతినడంతో తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టి వదిలేశారు.

ప్రతిపాదనలు పంపాం..

జిల్లాలో ప్రమాదకరంగా ఉన్న వంతెనలు, కల్వర్టుల పరిస్థితిని ఎప్పటికప్పుడు గుర్తించి ప్రభుత్వానికి నివేదిస్తున్నాం. శిథిలావస్థకు చేరిన కట్టడాల మరమ్మతులకు అంచనాలు రూపొందించాం. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం. – సుధాకర్, ఎస్ఈ, ఆర్‌అండ్‌బీ శాఖ

బయటపడిన ఇనుప చువ్వలు



నరసన్నపేట మండలం బాడాం వద్ద జలుమూరు కాలువపై నాలుగు దశాబ్దాల కిందట నిర్మించిన కల్వర్టు కుంగిపోయింది. శ్లాబు పెచ్చులూడటంతో ఇనుప చువ్వలు బయటకు కనిపిస్తున్నాయి. ఇది కూలితే బాడాం, తోటాడ, జగన్నాథపురం, కానుకుర్తివానిపేట గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోతాయి.

ఆర్‌అండ్‌బీ శాఖ పరిధిలో కల్వర్టులు	శ్రీకాకుళం డివిజన్	టెక్కలి డివిజన్	వర్షాలకు దెబ్బతిన్నవి	శిథిలావస్థకు చేరినవి
4,280	2,125	2,155	18	162

వరద బాధితులకు బాసట



విజయవాడ వరద బాధితులకు శ్రీకాకుళం గ్రామీణ మండలం రాగోలులోని బొల్లినేని బీఎస్సీ పారామెడికల్ కళాశాల (ఆదిత్య ఎడ్యుకేషనల్ సొసైటీ) విద్యార్థులు బాసటగా నిలిచారు. విరాళాల రూపంలో రూ.25,940 సమకూర్చారు. ఆ మొత్తాన్ని 'ఈనాడు' శ్రీకాకుళం యూనిట్ ఇన్‌ఛార్జి షేక్ కాలేషా వలికి అందజేశారు. కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు, బీఎస్సీ సమన్వయకర్త ఎంఎల్ఎన్ స్వామి, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం

రెండు కేంద్రాల్లో టెట్ ప్రారంభం

ఎచ్చెర్ల, నరసన్నపేట, న్యూస్‌టుడే: జిల్లాలోని రెండు కేంద్రాల్లో గురువారం ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ప్రారంభమైంది. ఉదయం 9.30 నుంచి 12 వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు పరీక్షలు జరిగాయి. రెండు షిఫ్టుల్లో కలిపి ఎచ్చెర్ల మండల కేంద్రంలోని శ్రీవెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల కేంద్రంలో 200 మందికి 188 మంది, నరసన్నపేటలోని గొట్టిపల్లి వద్ద కోర్ టెక్నాలజీలో 660 మందికి 527 మంది అభ్యర్థులు హాజరయ్యారు. చిలకపాలెంలోని శ్రీశివాని ఇంజినీరింగ్ కళాశాల కేంద్రంలో ఈ నెల 6, 13, 20 తేదీల్లో పరీక్షలు జరగనున్నాయి.

అదును చూసి.. చదును చేసి..!

- యథేచ్ఛగా ప్రభుత్వ భూముల ఆక్రమణ
- టెక్కలిలో పుట్టుకొస్తున్న అనధికార నిర్మాణాలు

న్యూస్‌టుడే, టెక్కలి, టెక్కలి పట్టణం

టెక్కలిలో ప్రభుత్వ భూముల ఆక్రమణలు నిత్యకృత్యంగా మారిపోయాయి. కొందరు కనిపించిన స్థలాన్ని కబ్జా చేసి చదును చేసేస్తున్నా అధికార యంత్రాంగం పట్టనట్లు వ్యవహరిస్తోంది. ఉద్యోగులు బదిలీల హడావుడిలో ఉండటంతో ఆక్రమణదారులు యథేచ్ఛగా తమ పని చేసుకుంటున్నారు. మంత్రి అచ్చెన్నాయుడు అక్రమ వ్యవహారాలపై ప్రశ్నిస్తే తప్ప అధికారులు చర్యలు తీసుకోవడానికి ముందుకు కదలడం లేదు.



వెంకటేశ్వర కాలనీ వెనుక భాగంలో ఆక్రమణకు గురవుతున్న గొర్జి పోరంబోకు

బక్కచిక్కిపోతున్న కాటాబంద: సర్వే నంబరు 468లోని కాటాబంద బక్కచిక్కిపోతోంది. టెక్కలి నడిబొడ్డున అయ్యప్పనగర్, భవానీనగర్‌ను ఆనుకుని ఉన్న ఈ స్థలంలో కొంత ప్రాంతాన్ని వసతిగృహ నిర్మాణానికి వినియోగించారు. మరికొంత భాగాన్ని ఔషధ నియంత్రణ అధికారి కార్యాలయం, కొన్ని కుల సంఘాలకు కేటాయించారు. మిగిలిన స్థలంలో కొందరు వెనుక నుంచి గుట్టుచప్పుడు కాకుండా నిర్మాణాలు సాగిస్తున్నారు. కళ్లెదుటే ఆక్రమణలు జరుగుతున్నా సరైన చర్యలు లేకపోవడంతో కొత్తవి పుట్టుకొస్తున్నాయి. ఇటీవల మంత్రి అచ్చెన్నాయుడు ఆ ప్రాంతాన్ని సందర్శించినప్పుడు ఆక్రమణలన్నీ తొలగించాలని ఆదేశించారు. 20 రోజులు కావొస్తున్నా అధికారులు చర్యలు తీసుకోలేదు.

అభివృద్ధి చేసి.. విక్రయించి

వెంకటేశ్వర కాలనీ వెనుక భాగంలో ఉన్న గొర్జి పోరంబోకు అక్రమార్కుల జేబులు నింపే వనరుగా మారింది. కొందరు స్థిరాస్తి వ్యాపారులు ఇప్పటికే ఆ ప్రాంతాన్ని ప్లాట్లుగా అభివృద్ధి చేసి విక్రయించారు. దీనిపై గతంలో సర్వే జరిగినా తొలగింపు చర్యలు లేకపోవడంతో ఇటీవల విక్రయాలు ప్రారంభమయ్యాయి. మరోవైపు దీనికి సమీపంలోనూ ఆక్రమణలు చోటుచేసుకుంటున్నాయి. అయ్యప్పనగర్, వెంకటేశ్వరకాలనీ గొర్జి పోరంబోకుల పరిధిలో అక్రమ వ్యవహారాలను అధికారులు కట్టడి చేయడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

సర్వే చేసి చర్యలు తీసుకుంటాం..

గొర్జి పోరంబోకును పరిశీలించాం. కాటాబంద పరిధిలో సర్వే సమగ్రంగా నిర్వహిస్తాం. ఆక్రమణలను గుర్తించి తొలగించేలా చర్యలు తీసుకుంటాం.

– దిలీప్‌చక్రవర్తి, తహసీల్దారు, టెక్కలి

శక్తిస్వరూపిణి.. ముక్తిప్రదాయిని..!



శ్రీకాకుళం: ప్రత్యేక అలంకరణలో విజయదుర్గాదేవి

జిల్లావ్యాప్తంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఊరూరా దుర్గామాత ఆలయాలు, దేవీపీఠాల్లో ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడింది. ఉదయం నుంచి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పలు చోట్ల ప్రత్యేక మండపాల్లో అమ్మవారి విగ్రహాలను కొలువుదీర్చారు. విశేష అలంకరణలు, ప్రత్యేక పూజలు జరిపించారు. మహిళలు సామూహిక కుంకుమార్చనలు చేశారు.

– న్యూస్‌టుడే, శ్రీకాకుళం సాంస్కృతికం



ఇచ్ఛాపురం: శైలపుత్రీదేవిగా దర్శనమిస్తున్న స్వేచ్ఛావతి అమ్మవారు



పాతపట్నం: నీలమణిదుర్గ ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు



శ్రీకాకుళం: బలగ కాలభైరవాలయంలో వారాహి, దుర్గామాత, సరస్వతిదేవి



గార: శ్రీకూర్మనాథ క్షేత్రంలో వైష్ణవి దుర్గామాతకు హారతి ఇస్తున్న అర్చకుడు



శ్రీకాకుళం: ముత్యాలమ్మ ఆలయంలో భక్తులు

ఉపాధ్యాయుడి దెబ్బకు విద్యార్థి కంటికి శస్త్ర చికిత్స

ఎచ్చెర్ల(రణస్థలం), న్యూస్‌టుడే: రణస్థలం మండలం పైడిభీమవరం జడ్పీ ఉన్నత పాఠశాలలో 8 తరగతి చదువుతున్న చెన్నా అరుణకుమార్ అనే విద్యార్థి కంటికి ఉపాధ్యాయుడి చేతిలో కర్ర తగలడంతో తీవ్ర గాయమైంది. అది శస్త్ర చికిత్సకు దారి తీసింది. శ్రీకాకుళం డివిజన్ ఉప విద్యాశాఖాధికారి ఆర్.విజయకుమారి తెలిపిన వివరాల ప్రకారం.. పాఠశాలలో ఈ నెల 1న విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్నారు. కొందరు విద్యార్థులు వరుస తప్పడంతో తోపులాట జరిగింది. వారిని సరి చేస్తున్న తెలుగు ఉపాధ్యాయుడు ఎన్.అరుణ్‌కుమార్ కర్రతో ఓ విద్యార్థిని కొట్టేందుకు ప్రయత్నించగా.. అది పక్కన ఉన్న చెన్నా అరుణ్‌కుమార్ కంటికి తగిలింది. గమనించిన ఉపాధ్యాయులు వెంటనే స్థానిక పీహెచ్‌సీకి తీసుకెళ్లగా మెరుగైన వైద్యం అవసరమని వైద్యులు సూచించారు. దీంతో ఉపాధ్యాయులు విద్యార్థి తల్లిదండ్రులకు సమాచారం అందించి.. ఇంటికి పంపారు. బుధవారం ఉదయం విద్యార్థి కన్ను ఎర్రగా మారి నొప్పి రావడంతో తల్లిదండ్రులు ఉపాధ్యాయులకు తెలియజేశారు. హుటాహుటిన విజయనగరం తీసుకెళ్లి వైద్యులకు చూపించగా విశాఖపట్నం తీసుకెళ్లాలని సిఫార్సు చేశారు. విశాఖపట్నంలోని ఎల్.వి.ప్రసాద్ కంటి ఆసుపత్రిలో గురువారం శస్త్ర చికిత్స చేశారు. ప్రస్తుతం అక్కడే చికిత్స పొందుతున్నాడు. విద్యార్థి కంటికి, చూపునకు ఎలాంటి ఇబ్బంది లేదని వైద్యులు తెలియజేశారు. దీనిపై తల్లిదండ్రులు ఎటువంటి ఫిర్యాదు చేయలేదని డిప్యూటీ డీఈవో తెలిపారు.

చర్యలు తీసుకోండి..: ఈ విషయమై విశాఖపట్నానికి చెందిన నవయానం బహుజన సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి వెంకటరమణ కలెక్టర్, జిల్లా విద్యాశాఖాధికారులకు ఫిర్యాదు చేశారు. నిరుపేద కుటుంబానికి చెందిన విద్యార్థి చూపు పోకుండా మెరుగైన వైద్యం అందించాలని, గాయానికి కారణమైన ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.


ఎక్సైజ్ కానిస్టేబుల్ ఆకస్మిక మృతి



మోహనరావు (పాతచిత్రం)

నరసన్నపేట, న్యూస్‌టుడే: ఎక్సైజ్ కానిస్టేబుల్ జలుమూరు మోహనరావు(33) గురువారం ఆకస్మికంగా మృతి చెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. నరసన్నపేటలో పని చేస్తున్న మోహనరావుకు పాతపట్నానికి బదిలీ అయింది. గురువారం ఉదయం నరసన్నపేట ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలో రిలీవ్ అయిన ఆయన పాతపట్నంలో బాధ్యతలు చేపట్టేందుకు వెళ్లారు. అప్పటికే తీవ్ర జ్వరంతో బాధపడుతూ.. ఆర్టీసీ బస్సులో అస్వస్థతకు గురయ్యారు. వెంటనే మోహనరావును తోటి ప్రయాణికులు పాతపట్నం ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. అప్పటికే పరిస్థితి విషమించడంతో వైద్య సేవలందించినా ఫలితం లేకపోయింది. ఎచ్చెర్లకు చెందిన మోహనరావు కుటుంబం నరసన్నపేటలోని కోవెలవీధిలో నివాసముంటోంది. ఈయనకు భార్య మౌనిక, కుమార్తె ఉన్నారు. మృతికి ఎక్సైజ్ సీఐ ఎస్వీ రమణమూర్తి, ఎస్సై గురుమూర్తి సంతాపం తెలిపారు.

గడ్డి మందు తాగి వృద్ధుడి ఆత్మహత్య



అప్పారావు

పోలాకి, న్యూస్‌టుడే: అనారోగ్యంతో వృద్ధుడి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పోలాకి మండలం పిరువాడ గ్రామంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదాడ అప్పారావు (65) కొంత కాలంగా కడుపునొప్పి, మూత్రపిండాల సమస్యతో బాధపడుతున్నారు. బుధవారం కడుపునొప్పి తాళలేక గడ్డి మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డారు. కుటుంబ సభ్యులు వెంటనే ఆయనను శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. అప్పారావుకు భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జి.రంజిత్ తెలిపారు.

బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోండి

శ్రీకాకుళం నేరవార్తావిభాగం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరంలోని ఓ ఫంక్షన్ హాల్ మేనేజర్‌పై ఈ నెల 1న మాజీ రౌడీషీటర్ దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏపీ హోటల్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఎస్పీ మహేశ్వరరెడ్డిని కోరారు. కలిశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం ఎస్పీని కలిసి వినతి పత్రం అందించారు. హోటళ్లు, ఇతర దుకాణాలపై అల్లరిమూకలు దాడులకు పాల్పడకుండా చూడాలని అందులో పేర్కొన్నారు. బాధితుడు ఇప్పటికే ఒకటో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వివరించారు. ఎస్పీని కలిసిన వారిలో అసోసియేషన్ నాయకులు మెట్ట నాగరాజు, కెల్ల చిన్నికిశోర్, నక్కారామరాజు, బాధితుడు ధనుంజయ్ ఉన్నారు. ఈ విషయమై సీఎం చంద్రబాబుకు సైతం వినతి పత్రం పంపినట్లు ఏపీ హోటల్స్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు.

సృజన వేదికపై సత్తా చూపుదాం రండి..!

● ఇన్‌స్పైర్ మనక్ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం



విద్యార్థుల్లో ఆలోచనా శక్తిని పెంపొందించి.. నవ్య ఆవిష్కరణలకు ప్రాణం పోసే దిశగా కేంద్రం ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఉత్తమ ప్రాజెక్టులు రూపొందించినవారికి జాతీయ స్థాయిలో ఇన్‌స్పైర్ మనక్ పురస్కారాలు అందజేస్తోంది. అందులో భాగంగా ఈ ఏడాదికి సంబంధించి ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ, గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు ఈ నెల 15వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు.

– న్యూస్‌టుడే, కలెక్టరేట్(శ్రీకాకుళం)

జిల్లాలోని విద్యార్థుల నుంచి ఏటా ఈ పురస్కారాలకు విశేష స్పందన కనిపిస్తోంది. భారీ ఎత్తున ప్రాజెక్టులు తయారు చేస్తూ ఆన్‌లైన్‌లో నామినేషన్లు సమర్పిస్తున్నారు. పలువురు రాష్ట్ర, జాతీయస్థాయిలో గుర్తింపు సాధిస్తున్నారు. ప్రోత్సాహకాలు పొందుతున్నారు. ఈసారి ప్రాజెక్టుల రూపకల్పనలో విద్యార్థులు 5 అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని అధికారులు సూచించారు. మేక్ ఇన్ ఇండియా, స్కిల్ ఇండియా, స్వచ్ఛభారత్, ఆరోగ్య భారత్, సరికొత్త ఇన్నోవేటివ్ అంశాలపై ప్రాజెక్టు తయారు చేయాలని నిర్దేశించారు.

జిల్లాలో ఎంపికైన ప్రాజెక్టుల వివరాలిలా..

సంవత్సరం	నామినేషన్లు	జిల్లా స్థాయి	రాష్ట్ర స్థాయి	జాతీయ స్థాయి
2018-19	1,470	71	7	2
2019-20	1,812	483	48	4
2020-21	1,730	263	26	4
2021-22	1,762	257	24	1
2022-23	1,678	207	20	4
2023-24	2,100	330	29	1

ఇవి గుర్తుంచుకోండి..

● ప్రాజెక్టును నామినేషన్ సమయంలో పొందుపరిచిన రైటప్ చదివి మాత్రమే ఎంపిక చేస్తారు. అందుకే రైటప్‌లో ఆకర్షణీయమైన శీర్షిక, ప్రాజెక్టు ఉద్దేశం, ఆవశ్యకత, సామాజిక అవసరం వంటి విషయాలు స్పష్టంగా రాయాలి. ● రైటప్‌తో పాటు ఆడియో, వీడియో క్లిప్‌లూ అప్‌లోడ్ చేయాలి. ఇది తప్పనిసరి కాదు. ● బ్యాంకు ఖాతా వివరాలు నమోదు చేసేటప్పుడు జాగ్రత్తగా చూసుకోవాలి.

ప్రధానోపాధ్యాయులు చొరవ తీసుకోవాలి..

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు ఇది గొప్ప వేదిక. ఉపాధ్యాయులు చక్కని మార్గదర్శకులుగా నిలిచి విద్యార్థులు ఉత్తమ ప్రాజెక్టులపై అత్యధిక ప్రతిపాదనలు నమోదు చేసేలా చూడాలి. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు చొరవ తీసుకోవాలి. జిల్లాలో 2 వేలకు తక్కువ కాకుండా నామినేషన్లు నమోదు కావాలని లక్ష్యంగా నిర్ణయించాం. ఇప్పటి వరకు 1,550 దాఖలయ్యాయి.

– ఎన్.కుమారస్వామి, జిల్లా సైన్సు అధికారి, శ్రీకాకుళం

నమోదు ప్రక్రియ ఇలా..

www.inspireawards-dst.gov.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి.. స్కూల్ అథారిటీ ఆప్షన్ ఎంచుకోవాలి. ఆ తర్వాత రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగించాలి. ఆన్‌లైన్ మోడ్‌ను ఎంచుకుని వస్తున్న ఆప్షన్లకు అనుగుణంగా వివరాలను నమోదు చేయాలి. నామినేషన్లను వెబ్‌సైట్‌లో పాఠశాల లాగిన్ నుంచి ఉన్నత పాఠశాలలైతే ఐదుగురు, ప్రాథమికోన్నత బడుల నుంచైతే ముగ్గురు విద్యార్థులు చొప్పున ప్రతిపాదనలను పంపాలి. విద్యార్థులు, తండ్రి పేర్లు, పుట్టిన తేదీ ఆధార్ సంఖ్య, విద్యార్థి బ్యాంకు ఖాతా, పాస్‌పోర్టు సైజు ఫొటో, ప్రాజెక్టు రైటప్ వంటి పొందుపరచాలి.

సాంకేతిక పరిజ్ఞానాన్ని సమాజాభివృద్ధికి ఉపయోగించాలి



సైబర్ ఎనలిస్ట్ సాయిసందీప్‌ను సత్కరిస్తున్న వీసీ రజని, అధికారులు

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: యువత అధునాతన సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంచుకొని, దాని నుంచి ఎదురయ్యే సవాళ్లను అధిగమించి సమాజాభివృద్ధికి ఆ సాంకేతికతను ఉపయోగించాలని డా.బి.ఆర్.అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య కె.ఆర్.రజని అన్నారు. వర్సిటీలోని సమావేశ మందిరంలో ఇంజినీరింగ్ కళాశాల ఈసీఈ విభాగం, సైంటిఫిక్ ప్రోగ్రాం ఫర్ అకడమిక్ రీసెర్చ్ సెల్ ఫౌండేషన్ (స్పార్క్) సంయుక్తంగా 'సైబర్ ప్రో-లాక్' పేరిట సైబర్ నేరాలపై విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ప్రపంచీకరణ నేపథ్యంలో ఏఐ వంటి అధునాతన సాంకేతిక పరిజ్ఞానం విప్లవాత్మక మార్పులు తీసుకొస్తుందని, ఇటువంటి వాటి పట్ల యువత అప్రమత్తమై సమాజ శ్రేయస్సుకు వినియోగించాలన్నారు. స్పార్క్ సంస్థ సైబర్ ఎనలిస్టు ఎస్.సాయిసందీప్ మాట్లాడుతూ సైబర్ నేరాలను సమర్థంగా ఎదుర్కోవాలంటే సాంకేతిక నైపుణ్యంపై పట్టు సాధించాలన్నారు. రెక్టార్ బిడ్డికి అడ్డయ్య, రిజిస్ట్రార్ పీలా సుజాత, సీఐ అవతారం, ఎస్సై వి.సందీప్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అవగాహనతోనే పంచాయతీల బలోపేతం



మాట్లాడుతున్న కృష్ణమోహన్, చిత్రంలో జడ్పీ సీఈవో, డీపీవో

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు వ్యవస్థపై సమగ్ర అవగాహన కలిగి ఉంటేనే పంచాయతీలు బలోపేతమవుతాయని ఏపీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్(ఏపీఎస్ఐఆర్డీ) అదనపు కమిషనర్ కృష్ణమోహన్ అన్నారు. శ్రీకాకుళం నగరంలోని జిల్లా పరిషత్తు సమావేశ మందిరంలో ఎంపీడీవోలు, ఈవోపీఆర్డీలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మూడు రోజుల పాటు జరిగే శిక్షణను గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. పంచాయతీలను బలోపేతం చేయడమే రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ లక్ష్యమన్నారు. అందులో భాగంగా గ్రామ పంచాయతీల్లో చేపట్టాల్సిన పనులు, బాధ్యతలు, ఇతర అంశాలపై స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేందుకు రానున్న రోజుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. వారికి అవగాహన కల్పించేందుకు మాస్టర్ ట్రైనీలకు ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో ఆర్.వెంకట్రామన్, డీపీవో బి.వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

గత ధర్మకర్తల మండలి తీరుతోనే తిరుమలకు అప్రతిష్ఠ



మాట్లాడుతున్న కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్

పాతశ్రీకాకుళం, న్యూస్‌టుడే: గత ధర్మకర్తల మండలి తీరుతోనే తిరుమలకు అప్రతిష్ఠ చేకూరిందని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ పేర్కొన్నారు. శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'తిరుమలలో రూ.500 టికెట్లు రూ.5 వేలకు అమ్ముకున్నారు. వాళ్లకు నచ్చినవారికి కాంట్రాక్టులు, పనులు అప్పగించి ముడుపులు అందుకున్నారు. మార్కెట్‌లో నాణ్యమైన నెయ్యి ధర కిలో రూ.800 పలుకుతుంటే రూ.320కి సరఫరా చేసిన దాంట్లో కల్తీ కాకుండా ఎలా ఉంటుంది? కూటమి ప్రభుత్వం ప్రచారం చేస్తున్నట్లు తిరుమల లడ్డూలో గొడ్డు మాంసం కలవలేదు. కానీ నెయ్యిలో ఇతరత్రా నూనెలు కల్తీ జరిగిన మాట వాస్తవం. హరియాణా, మహారాష్ట్ర, జమ్మూకశ్మీర్‌లలో కాంగ్రెస్ విజయం సాధించబోతుంది. సూపర్-6 పథకాల్లో ఉచిత బస్సు సౌకర్యం ఎప్పుడు అమలు చేస్తున్నారో సీఎం చంద్రబాబు చెప్పాలి. 100 రోజుల పాలనలో శ్రీకాకుళం జిల్లాకు ఏమైనా చేశారా? జిల్లా అభివృద్ధి గురించి, ఇక్కడి నిరుద్యోగం గురించి నాయకులు ఆలోచించట్లేదు.' అని అన్నారు. సమావేశంలో పలువురు డీసీసీ నాయకులు పాల్గొన్నారు.

సహారా బాధితులకు న్యాయం చేయాలి



సమావేశంలో పాల్గొన్న సహారా కస్టమర్స్, వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: ఖాతాదారులకు డిపాజిట్ సొమ్మును తక్షణమే చెల్లించాలని సహారా కస్టమర్స్, వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. శ్రీకాకుళం నగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో గురువారం సహారా బాధితులు, సిబ్బంది సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గత 12 ఏళ్లలో సహారా చెల్లింపులు జరగక 7,674 మంది ఏజెంట్లు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్కడా వ్యాపారాలు చేయకూడదని దిల్లీ హైకోర్టు ఆదేశాలు జారీ చేసినప్పటికీ దేశవ్యాప్తంగా అనేక శాఖల్లో అక్రమంగా లావాదేవీలు కొనసాగిస్తున్నారని ఆరోపించారు. సుప్రీంకోర్టు చొరవ తీసుకొని సహారా ఆస్తులు విక్రయించైనా సరే ఖాతాదారులకు న్యాయం చేయాలని కోరారు.

వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ

సారవకోట, న్యూస్‌టుడే: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) విజయనగరం విభాగ్ ఆధ్వర్యంలో సారవకోటలోని సమీకృత వసతిగృహంలో వ్యక్తిత్వ వికాసంపై మూడు రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఖండ ప్రచారక్ వాడ పున్నయ్య తెలిపారు. శిక్షణలో పాల్గొన్న వారికి వ్యక్తిగత సామర్థ్యాల పెంపు, యోగా, కర్రసాము, ఆటలు, దేశభక్తి గీతాలు, భారతీయ చారిత్రక యోధుల గాథలు, సామూహిక చర్చలు వంటి అంశాల్లో తర్ఫీదు ఇస్తామని చెప్పారు. 14 సంవత్సరాల వయస్సు పైబడిన వారు అర్హులని, పాల్గొనదలచిన వారు వర్గ రుసుం కింద రూ.200 చెల్లించాలని చెప్పారు. 5, 6, 7 తేదీల్లో శిక్షణ తరగతులు జరుగుతాయని, అదనపు సమాచారం కోసం 77024 90940 నంబరును సంప్రదించాలని కోరారు.

జాతీయ స్థాయి పోటీల్లో సత్తా



పెద్దింటి చైతన్య

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: బాక్సింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(బీఎఫ్ఐ) ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయస్థాయి ప్రతిభాన్వేషణ పోటీల్లో జిల్లా క్రీడాకారిణి పెద్దింటి చైతన్య సత్తా చాటింది. విశాఖపట్నం వేదికగా భారత క్రీడాప్రాధికార సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో శ్రీకాకుళం నగరం పుణ్యపువీధికి చెందిన క్రీడాకారిణి తన పంచ్ పవర్ ప్రదర్శించి కాంస్య పతకం దక్కించుకుంది. ఈ సందర్భంగా చైతన్యను పలువురు అభినందించారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	140	235	255

బస్‌పాస్ జారీకి నూతన వెబ్‌సైట్

అరసవల్లి, టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థులకు ఆర్టీసీ జారీ చేసే ఉచిత, రాయితీ బస్‌పాస్‌లకుగాను నూతన వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు జిల్లా ప్రజారవాణాధికారి(డీపీటీవో) విజయ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిధిలో నెలవారీ సీజన్ టిక్కెట్‌పై ప్రయాణించేవారికీ పాస్‌ల మంజూరు మరింత సులభతరం చేసేందుకు వెబ్‌సైట్‌ను అప్‌గ్రేడ్ చేస్తున్నామని వివరించారు. అందులో భాగంగా ఈ నెల 5, 6 తేదీల్లో సేవలు అందవని, 7 నుంచి యథావిధిగా బస్‌పాస్‌ల జారీ ప్రక్రియ కొనసాగుతుందని చెప్పారు. కొత్తగా పాస్ తీసుకోవాల్సిన విద్యార్థులు సంబంధిత ధ్రువపత్రాలతో apsrtc.in వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకోవాలని, అనంతరం పలాస, టెక్కలి, శ్రీకాకుళం బస్ స్టేషన్లలోని కౌంటర్ల వద్ద రాయితీ పాస్‌లను పొందవచ్చునని సూచించారు.



కొత్తూరు: గూనభద్రలో వేపాకు కషాయం తయారు చేస్తున్న సిబ్బంది

16 నెలలుగా.. వేతనాలందక..!

● ప్రకృతి సేద్యం సిబ్బందికి తప్పని తిప్పలు

రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తామని ఐదేళ్ల పాటు ఊదరగొట్టిన గత పాలకులు ప్రకృతి సేద్యం సిబ్బందికి మొండి చేయి చూపారు. ఒకటి.. రెండు కాదు 16 నెలలుగా వేతనాలివ్వకుండా వేదనకు గురి చేశారు. ఇప్పటికీ జీతాలు అందకపోవడంతో అప్పులు చేసి కుటుంబాలను నెట్టుకొస్తున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం తమ గోడును ఆలకించి వేతన బకాయిలు అందజేయాలని కోరుతున్నారు.

న్యూస్‌టుడే, కొత్తూరు, పాతపట్నం

జిల్లావ్యాప్తంగా ప్రకృతి సేద్యం విభాగంలో ఎన్ఎఫ్ఏ, ఎంటీ, యూనిట్ బాధ్యులు, సీఆర్పీలు, మార్కెటింగ్ ఉద్యోగులతో కలిసి నాలుగు వందల మంది పని చేస్తున్నారు. వీరంతా పెట్టుబడి అవసరం లేని జీవామృతం, కషాయాలు, అజోలా వంటి వాటితో వ్యవసాయం చేసేలా రైతులను ప్రోత్సహిస్తున్నారు. చిరుధాన్యాల సాగు, వరి, చెరకు ఇతర పంటలను ఈ పద్ధతిలో పండిస్తున్నారు. ఎలాంటి రసాయన ఎరువులు ఉపయోగించకపోవడంతో ఈ ఉత్పత్తులకు గిరాకీ ఉంటోంది. జిల్లాలో ఇదే విధానంలో పండించిన చెరకు నుంచి తయారు చేసిన బెల్లం తిరుపతి తిరుమల దేవస్థానానికి వెళ్తోంది. కొన్ని ఉత్పత్తులు ఒడిశా, తెలంగాణాకు సైతం వెళ్తున్నాయి. ఇలా రైతులకు అన్ని సూచనలు ఇస్తూ, సేంద్రీయ ఎరువుల తయారీపై అవగాహన కల్పిస్తున్న ఈ శాఖలో పనిచేస్తున్న వారు సైతం నెలలు తరబడి వేతనాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై ప్రకృతి సేద్యం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రేవతి మాట్లాడుతూ వేతన బకాయిల సమస్యను ఉన్నతాధికారులకు నివేదించామని, వారి ఆదేశాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బకాయిలు విడుదల చేయాలి..



16 నెలలుగా వేతనాలందకపోవడంతో అప్పులు చేసి జీవనం సాగిస్తున్నాం. భార్య మెడలోని బంగారాన్ని తాకట్టు పెట్టి పిల్లలను చదివించుకుంటున్నాం. ఇటీవల పిల్లలకు బాగోలేకపోతే అధిక వడ్డీలకు డబ్బులు అప్పు తీసుకొని వైద్యం చేయించాను. ప్రభుత్వం స్పందించి వెంటనే వేతన బకాయిలు విడుదల చేయాలి.

– ఎస్.సూర్యనారాయణ, ప్రథమ శిక్షకుడు(ఎంటీ), కొత్తూరు మండలం

జిల్లాలో వివరాలిలా.. ● మొత్తం మండలాలు: 30 ● వ్యవసాయ సబ్ డివిజన్లు: 07 ● ప్రకృతి సేద్యం యూనిట్లు: 07 ● పని చేస్తున్న సిబ్బంది: 400

పలాస

• పలాస •ఇచ్ఛాపురం



ద్విసహస్ర చామంతులతో అర్చన

ఇచ్ఛాపురంలోని ప్రసిద్ధ క్షేత్రం శ్రీజగన్నాథస్వామి దేవస్థానం ప్రాంగణంలో కొలువుదీరిన శ్రీమహాలక్ష్మీదేవికి ద్విసహస్ర చామంతిపూలతో ప్రత్యేక అర్చన నిర్వహించారు. శ్రీమహాలక్ష్మి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, దీపజ్యోతి పూజ అనంతరం పాలు, పంచామృతాలు, ఫలరసాలతో అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ చేశారు. - న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

రహదారి నాణ్యతలో రాజీ వద్దు

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: ప్రజలకు ఉపయోగకరమైన రహదారి నిర్మాణాన్ని నాణ్యతగా, ఒప్పందం మేరకు చేయాలని, రాజీ వద్దని పుర కమిషనర్ నల్లి రమేష్ అన్నారు. ఫకీరుపేటలో అసంపూర్తిగా మిగిలిపోయిన 15వ ఆర్థిక సంఘ నిధులు రూ.15లక్షలతో చేపట్టారు. ఈ పనులను గురువారం కమిషనర్ పరిశీలించారు. పనులను వేగంగా పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఈ కామేశ్వరరావు కూడా పాల్గొన్నారు.



ఫకీరుపేట రహదారి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ రమేష్

వెంకన్న సేవలో ఎమ్మెల్యే శిరీష పూజలు

పలాస, న్యూస్‌టుడే: తిరుమలలో వేంకటేశ్వరుడిని పలాస ఎమ్మెల్యే దంపతులు గౌతు శిరీష, వెంకన్నచౌదరిలు గురువారం దర్శనం చేసుకున్నారు. కూటమి విజయం, మందస మండలంలో అత్యధిక మెజారిటీ సాధించడంతో మందస మండల తెదేపా నాయకులతో తిరుమలకు వెళ్లారు. కార్యక్రమంలో మందస మండల తెదేపా నాయకులు పాల్గొని, తలనీలాలు సమర్పించారు.



తిరుమల ఆలయ ఆవరణలో ఎమ్మెల్యే దంపతులు

ఇసుక ట్రాక్టరు సీజ్

హరిపురం (మందస), న్యూస్‌టుడే: మందస మండలం తార్లకురంట్ల సమీపంలో మహేంద్రతనయనది నుంచి అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టరును బాలిగాం సమీపంలో మందస పోలీసులు పట్టుకున్నారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఇచ్ఛాపురంలో వర్షం

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: మేఘావృత ఛాయలు లేకుండా ఇచ్ఛాపురం పట్టణంలో 20 నిమిషాలపాటు గాలితో కూడిన వర్షం గురువారం కురిసింది. మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణం మారిపోయి. మళ్లీ ఎండ కాసింది.



కాశీబుగ్గ నుంచి అక్కుపల్లి మీదుగా వజ్రపుకొత్తూరు వరకు రెండు వరుసల రహదారిగా మార్చే పనులు ఇప్పట్లో పూర్తి అయ్యే సూచనలు కనిపించడం లేదు. సంబంధిత గుత్తేదారు పనులు చేయలేనని అధికార యంత్రాంగానికి లేఖ ద్వారా తెలియజేశారు. దీంతో ప్రజలకు అవస్థలు తప్పేలా లేవు. - న్యూస్‌టుడే, కాశీబుగ్గ-పలాస

కాశీబుగ్గ-వజ్రపుకొత్తూరు రోడ్డుకు.. వీడని గ్రహణం

- బిల్లులు చెల్లించకపోవడంతో ఆగిపోయిన పనులు
- ప్రజల రాకపోకలకు తప్పని అవస్థలు

కాశీబుగ్గ నుంచి వజ్రపుకొత్తూరు వరకు సుమారు 16 కిలో మీటర్ల పొడవున రూ.17 కోట్లతో రెండు వరుసల రహదారి నిర్మాణానికి మూడేళ్ల క్రితం వైకాపా మంత్రి సీదిరి అప్పలరాజు శంకుస్థాపన చేశారు. అందులో భాగంగా రహదారులు భవనాలు శాఖ పర్యవేక్షణలో రెండు వరుసల రోడ్డు పనులకు శ్రీకారం చుట్టారు. కాశీబుగ్గ నుంచి వజ్రపుకొత్తూరు వరకు చిప్స్, క్రషర్ బుగ్గి వేశారు. అలాగే పలు చోట్ల తారు పొర కూడా వేశారు. మొత్తంగా సుమారు రూ.8 కోట్లు విలువైన పనులు చేపట్టారు. దీనికి సంబంధించిన బిల్లులు గుత్తేదారుకి చెల్లించే పరిస్థితి లేకపోవడంతో ఆరు నెలలుగా పనులు నిలిచిపోయాయి. దీంతో 4 కిలో మీటర్ల మేర రాళ్లు తేలి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. రాళ్లు తేలుతుండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో పనులు చేయలేమని సంబంధిత గుత్తేదారు ఉన్నత యంత్రాంగానికి లేఖ ద్వారా తెలియజేశారు. దీంతో పనులు ఇప్పట్లో జరిగే పరిస్థితి కనిపించడం లేదు.



పనులు చేయాల్సిన రహదారి

నిధులు వస్తే పనులు చేస్తాం

ఇప్పటి వరకు జరిగిన పనికి సంబంధించి గుత్తేదారునికి బిల్లులు చెల్లించాల్సి ఉంది. చెల్లించకపోవడంతో పనులు చేయలేమని గుత్తేదారు లేఖ రాశారు. విషయం ఉన్నత యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లాం. నిధులు ఇస్తే పనులు మొదలు పెడతాం.

– ఎస్.రామినాయుడు. డీఈ. రహదారులు, భవనాలు శాఖ.

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM)

ఇచ్ఛాపురం: 9440437129
పలాస : 8008574279
కవిటి గ్రామీణం: 8309638875
పలాస గ్రామీణం: 7386409926
కంచిలి గ్రామీణం: 9704560738

? పలాస మండలం దానగోరలో కాలువ లేక ఇబ్బంది పడుతున్నాం. - గ్రామస్థులు

● గ్రామసభలో తీర్మానించి, నిధులొస్తే పనులు చేపడతాం. - ఆశ, పంచాయతీ కార్యదర్శి, తర్లాకోట - న్యూస్‌టుడే, పలాస గ్రామీణం

? ఇచ్ఛాపురం పట్టణం మంగళవారంపేటలో కాలువలను శుభ్రం చేయడంలేదు. - పి.వెంకటరావు, ఇచ్ఛాపురం

● చర్యలు తీసుకుంటాం. - పి.ఉపేంద్రకుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, ఇచ్ఛాపురం - న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

పంట కోత ప్రయోగాలు పారదర్శకంగా నిర్వహించాలి

కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే: పంట కోత ప్రయోగాలు పారదర్శకంగా నిర్వహించాలని తహసీల్దారు మురళీ మోహన్ అన్నారు. గురువారం కవిటి తహసీల్దార్ కార్యాలయంలో వ్యవసాయ సహాయకులు, వీఆర్వోలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట కోత ప్రయోగాలు గురించి వివరించారు. అనంతరం మండల వ్యవసాయాధికారి దుర్గాప్రసాద్ పంట కోత ప్రయోగాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డీటీ రామచంద్రరావు, ఏఎస్‌వో మనోహర్ రావు, వ్యవసాయం సహాయకులు, వీఆర్వోలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ మురళీ మోహన్

నిత్యం నరకయాతన



వజ్రపుకొత్తూరు మండలం హుకుంపేట ప్రధాన ఆర్ అండ్‌బీ రహదారి ఉన్నత పాఠశాల వద్ద పెద్ద పెద్ద గుంతలు అడుగడుగునా ఉండటంతో ప్రయాణికులు నరకయాతన పడుతున్నారు. ఇప్పటికే ఈ విషయమై పలు మార్లు అధికారులకు, నాయకులకు విన్నవించినా ఫలితం లేకపోయిందని, ప్రయాణికుల సౌకర్యార్థం ఇక్కడ గుంతలను పూడ్చి ప్రయాణం మెరుగు పరచాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. ఈ అంశాన్ని స్థానిక పంచాయతీ అధికారి త్రినాథ్‌రెడ్డి వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా సమస్య ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషిచేస్తానని తెలిపారు.

దారితో అవస్థలు

కంచిలి మండల పరిధి సాలినపుట్టుగ గ్రామంలో శ్మశాన వాటికకు వెళ్లే దారి ఇటీవల కురిసిన వర్షాలకు అధ్వానంగా మారింది. అంత్యక్రియల సమయంలో ఇబ్బందులు పడుతున్నామని ఆ గ్రామ ప్రజలు వాపోతున్నారు. ఇరువైపులా పనికిరాని మొక్కలు పెరిగిపోవడంతోపాటు కొన్ని చోట్ల మట్టిదారి పూర్తిగా ధ్వంసమై గోతులమయమవడంతో మృతదేహాలు తీసుకెళ్లే సమయంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. సర్పంచ్ ఝాన్సీలక్ష్మి వద్ద ఈ విషయాన్ని ప్రస్తావించగా త్వరలోనే రహదారి నిర్మిస్తామన్నారు. – న్యూస్‌టుడే, కంచిలి గ్రామీణం



రోడ్డు పక్కనే చెత్త



పలాస మండలం గరుడఖండిలో రోడ్డు పక్కనే చెత్త పారబోస్తుండటంతో ప్రయాణికులు, స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. దుర్వాసన వెదజల్లుతోందని, అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయం పంచాయతీ కార్యదర్శి శ్రీధర్ దృష్టికి తీసుకెళ్లగా ఒకట్రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామన్నారు.

– న్యూస్‌టుడే, పలాస గ్రామీణం

మురుగు పారేదెలా?

పుర పరిధి రత్తకన్న ప్రధాన వీధి మార్గం (బిర్లంగి రోడ్డు)లో పంచాయతీ కాలం నాటి కాలువ ధ్వంసమైనా చర్యలు తీసుకోవడం లేదు. దీంతో వర్షంపడితే రోడ్డు పైకి మురుగునీరు ప్రవహిస్తోంది. నడిచేందుకూ ఇబ్బందిగా ఉంటోందని స్థానికులు వాపోతున్నారు. కాలువను పటిష్ఠ పరిచి, కల్వర్టులు నిర్మించి, రహదారులను పరిరక్షించాలని, మురుగునీటి నిర్వహణ చేపట్టాలని వారు కోరుతున్నారు. కౌన్సిల్ తీర్మానం ద్వారా ఈ సమస్యలు పరిష్కరిస్తామని కమిషనర్ నల్లి రమేష్ తెలిపారు.

– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం



అస్తవ్యస్తం.. చర్యలు శూన్యం



కంచిలి ప్రధాన రహదారి గొల్లకంచిలి రోడ్డు నుంచి కంచమ్మతల్లి ఆలయం సింహద్వారం వరకు సరైన మురుగునీరు పారుదల సదుపాయం లేకపోవడంతోపాటు రోడ్డు పైన నిలిచిపోతోంది. స్థానిక స్టేట్‌బ్యాంక్, రైలు నిలయం, బస్టాండ్, చేపల బజారు తదితర ప్రాంతాల్లో ఇబ్బందికరంగా మారుతోంది. రోడ్డు సైతం అస్తవ్యస్తంగా తయారైంది. ఈ విషయమై ఈవోపీఆర్డీ రాంబాబు వివరణ కోరగా ఇప్పటికే పలుమార్లు చర్యలు తీసుకొన్నామన్నారు. మరోమారు ఆక్రమణల తొలగింపుతోపాటు మురుగునీరు సజావుగా వెళ్లేలా చర్యలు చేపడతామన్నారు.

– న్యూస్‌టుడే, కంచిలి

గడువు ముగిస్తే బిల్లులు రావు

పలాస, న్యూస్‌టుడే: పురపాలక సంఘంలో అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలపై ఆర్పీలంతా అవగాహన కలిగించి పూర్తి చేసేలా చూడాలని ఎస్‌డీఎస్ సి.హెచ్.మల్లేశ్వరరావు కోరారు. పలాస మెప్మా కార్యాలయంలో గురువారం ఆర్పీలతో సమావేశం నిర్వహించారు. 2025 మార్చినాటికి ఇళ్లు పూర్తి చేసేలా చూడాలన్నారు. గడువు ముగిస్తే బిల్లులు రావని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మల్లేశ్వరరావు

పరాశక్తి పాహిమాం

దేవీ శరన్నవరాత్రుల పూజలు గురువారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయాలు, మండపాల్లో దుర్గాదేవి విగ్రహాలను ప్రతిష్ఠించారు. భక్తులు దర్శించుకుని, అభిషేకాలు, సహస్ర నామార్చనతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. – న్యూస్‌టుడే, బృందం




పలాస లేబర్‌కాలనీ అయోధ్య రామ మందిరం నమూనాలో వేసిన మండపం



కవిటి గ్రామీణం: రాజపురంలో పూజలందుకుంటున్న అమ్మవారు



కంచిలి గ్రామీణం: ఎం.ఎస్.పల్లిలో..



సోంపేట డాబాకాలనీలో..



కంచిలిలో..

విరిగిన కల్వర్టు.. మొదలైన ఇక్కట్లు

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: వివిధ ప్రాంతాల నుంచి ఇచ్ఛాపురానికి రాకపోకలు సాగించే పెద్ద వాహనాలు ఎల్లమ్మగుడిరోడ్డు (బంద రోడ్డు) మీదుగా బెల్లుపడ నుంచి జాతీయరహదారికి రాకపోకలు చేస్తున్నాయి. ఈ మార్గం మేర సామర్థ్యం కోల్పోయిన వంతెనలు, కల్వర్టులు ఉన్నా, పట్టించుకోకపోవడంతో బరువు ఎక్కువై కుంగిపోతున్నాయి. పాతజాతీయరహదారి నుంచి బందరోడ్డుకు వెళ్లే మార్గంలో ఉన్న కల్వర్టు పలకలు ఒకొక్కటిగా విరిగిపోవడంతో గురువారం వాహన రాకపోకలకు అంతరాయం కలిగింది. ఒక లగేజీ వాహనం ఆ స్థలంలో చిక్కుకుపోవడంతో, స్థానికులు శ్రమించి బయటకు తీశారు. అన్ని వాహనాలు ప్రత్యామ్నాయ మార్గం సుమండి రోడ్డు (ఒడిశా) మీదుగా వెళ్లాయి. రహదారులు-భవనాల శాఖ అధికారుల ఆధ్వర్యంలో బలమైన స్లాబ్ కల్వర్టు నిర్మాణం చేయాలని ప్రయాణికులు, స్థానికులు డిమాండ్ చేశారు.



కల్వర్టులో ఇరుక్కుపోయిన సరకుల వ్యాను

సమస్య పరిష్కరిస్తాం

నిధులు మంజూరు కాగానే స్లాబ్ కల్వర్టు నిర్మిస్తాం. వాహన రద్దీ పెరగడంతో పాటు, కల్వర్టు వద్దనే మలుపు ఉండటం వల్ల దానిపై బరువు ఎక్కువగా పడుతోంది. సాంకేతికపరమైన అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని, సమస్య పరిష్కరిస్తాం.

– ఎస్.రామినాయుడు, డీఈఈ, ర.భ.శాఖ, ఇచ్ఛాపురం

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

పలాస, కవిటి, న్యూస్‌టుడే: చిన్నబడాం, శ్రీనివాసనగర్ 11 కేవీ ఫీడర్ పరిధిలో శుక్రవారం విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్తు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నాగేశ్వరరావు తెలిపారు. పెంటిభద్ర, జయరామచంద్రపురం, పద్మనాభపురం, పాత జాతీయ రహదారి, తాళభద్ర, నీలాపురం, నర్సిపురం, రైల్వేగేట్‌డౌన్, పెసరపాడు, చిన్నబడాం, అంతరకుడ్డ, రాజపురం, శ్రీనివాసనగర్, మండల పరిషత్‌కార్యాలయం వీధి, రోటరీనగర్ ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలుగుతుందని సహకరించాలని కోరారు. ● కవిటి సెక్షన్ రాజపురం సబ్‌స్టేషన్ పరిధిలో 11కేవీ మరమ్మతులు, చెట్లు తొలగించనుండటంతో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలుగుతుందని పలాస విద్యుత్ శాఖ ఈఈ పి.యోగేశ్వరరావు తెలిపారు. భైరిపురం, డి.జి.పుట్టుగ, నెలవంక, కపాసుకుద్ది పంచాయతీ గ్రామాలకు సరఫరా ఉండదన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు విద్యార్థుల ఎంపిక

ఇచ్ఛాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు ఇచ్ఛాపురం మండలం డొంకూరు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు నలుగురు ఎంపికయ్యారు. గత నెల శ్రీకాకుళంలో జరిగిన కోన చిన్నారావు స్మారక అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ చాటారు. భరత్‌చంద్ర, వినీత, అన్విత, అమృత శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాలలో జరిగే పోటీల్లో పాల్గొంటారని హెచ్‌ఎం సరోజిని తెలిపారు.



సంక్షిప్త సమాచారం

కంచిలి ఎంపీడీవోగా తిరుమలరావు

కంచిలి, వజ్రపుకొత్తూరు, మందస, న్యూస్‌టుడే: కంచిలి నూతన ఎంపీడీవోగా తిరుమలరావు బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ విధులు నిర్వహించిన నీరజ బదిలీపై వెళ్లగా ఆమె స్థానంలో ఈయన వచ్చారు. ● వజ్రపుకొత్తూరు మండల ఎంపీడీవోగా నడిమింటి రమేశ్‌నాయుడు బాధ్యతలు తీసుకున్నారు. ● మందస ఎంపీడీవోగా పి.సూర్యనారాయణ విధుల్లోకి చేరారు. పలువురు మండల అధికారులు, మండల పరిషత్ సిబ్బంది పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు.



విద్యార్థికి అభినందన

వజ్రపుకొత్తూరు గ్రామీణం: వజ్రపుకొత్తూరు మండలం తామాడపేటకు చెందిన తామాడ శృతి ఇటీవల విడుదలైన నీట్ ప్రవేశ పరీక్షలో 720 మార్కులకు గాను 615 మార్కులు సాధించి శ్రీకాకుళం ప్రభుత్వ వైద్య కళాశాలలో సీటు సాధించింది. ఈమేరకు గురువారం స్థానిక మాజీ సర్పంచి దుర్రు నారాయణ స్వామి, దశరథ, కుటుంబ సభ్యులు గ్రామ పెద్దలు అభినందించారు.

బాధ్యతగా పనిచేస్తా

పలాస, న్యూస్‌టుడే: అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తానని రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ ఛైర్మన్ వజ్జ.బాబురావు అన్నారు. గురువారం ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్, సోంపేటలో మాజీ ఎమ్మెల్యే గౌతు శ్యామసుందర శివాజీలను మర్యాదపూర్వకంగా కలిశారు. అశోక్, శివాజీలకు పుష్పగుచ్ఛంతో సత్కరించారు. కార్యక్రమంలో తెదేపా పార్లమెంటరీ జిల్లా ప్రధాన కార్యదర్శి విఠల్, తెదేపా నాయకులు శంకరరావు, చంద్రమౌళి, అంబికా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే అశోక్‌ను సత్కరిస్తున్న వజ్జ బాబురావు

వన్యప్రాణులను సంరక్షిద్దాం

ఇచ్ఛాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: వన్యప్రాణుల సంరక్షించుకోవడం కనీస బాధ్యతని కాశీబుగ్గ అటవీశాఖాధికారి ఏఎంకే నాయుడు అన్నారు. జాతీయ వన్యప్రాణి సంరక్షణ దినాన్ని పురస్కరించుకుని తేలుకుంచిలో ప్రత్యేక కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. గ్రామానికి వచ్చే పక్షులను ఆదరిస్తున్న గ్రామస్థులను అభినందించారు. అనంతరం గ్రామ వీధుల్లో చైతన్య ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో మందస డీఆర్‌వో రాము, బీట్ పీసీలు భానుమూర్తి, వెంకటేశ్వరరావు, జోగారావు, పోలయ్య, లక్ష్మణమూర్తి, బాబూరావు, సురేష్, దుర్గాదేవి పాల్గొన్నారు.



తేలుకుంచిలో ప్రదర్శన నిర్వహిస్తున్న అటవీశాఖ అధికారులు, సిబ్బంది

మెరుగైన వసతులు కల్పించండి

పలాస గ్రామీణం, న్యూస్‌టుడే: పలాస మండలం రామకృష్ణాపురంలోని శ్రీ సత్యసాయి విద్యావిహార్‌ని శ్రీ సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు రఘుపాత్రుని లక్ష్మణరావు గురువారం పరిశీలించారు. పాఠశాలలో మెరుగైన ఉపాధ్యాయులను నియమించి, విద్యార్థులకు ఐఐటీ ఫౌండేషన్ కోర్సులు చెప్పాలని, వసతిగృహంలో ఉంటున్న విద్యార్థులకు వసతి, ఆహారం ఏర్పాటు చేయాలన్నారు.

స్వేచ్ఛావతి ఆలయంలో పూజలు

ఇచ్ఛాపురం ఇలవేల్పు శ్రీస్వేచ్ఛావతి అమ్మవారి దసరా నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో భక్తులు గురువారం ఉదయం అమ్మవారికి అభిషేకం, మర్ధన కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు దీపార్చన మండపంలో దీపాలు వెలిగించి పూజలు చేశారు. హోమమండపంలో అమ్మవారి ఉత్సవ మూర్తిని ప్రతిష్ఠించి, అక్కడ శాంతిహోమాలు చేశారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ, సాయంత్రం సామూహిక పారాయణ, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. -న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం



ఆలయంలో భక్తుల పూజలు

పచ్చి రొట్ట ఎరువుతో భూసారం

కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే: భూమి సారానికి పచ్చిరొట్ట ఎరువులు వాడాలని, సమగ్ర ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటించాలని వ్యవసాయాధికారి దుర్గాప్రసాద్ అన్నారు. గురువారం కుసుంపురం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వరిపైరు చిరుపొట్ట దశలో ఉందని యూరియా 15 కిలోలు, పొటాష్ 15 నుంచి 20 కిలోలు ఎకరానికి వినియోగించాలని సూచించారు. రైతులందరూ ఈకేవైసీ చేయించుకోవాలని, సూక్ష్మ నీటి సేద్యం కోసం బిందు, తుంపర పరికరాలకు నమోదు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఈవో లలితా కుమారి, అన్వేష్, జగదీష్, సర్పంచ్ శ్రీకాంత్, రైతులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న రైతులు, అధికారులు

బ్రహ్మాస్త్రంతో తెగుళ్ల నివారణ

కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే : వరికి ఆశించిన తెగులును బ్రహ్మాస్త్రంతో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో నివారించవచ్చని ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌ఛార్జి తులసయ్య అన్నారు. గురువారం కవిటి మండలం, శిలగాం గ్రామంలో రైతులకు బ్రహ్మాస్త్రం తయారీపై అవగాహన కల్పించారు. 10 లీటర్ల నీరు, 5 రకాల ఆకులు ఒక పాత్రలో వేసి 5 పొంగులు వచ్చేవరకు ఉడికించాలి. దీన్ని 200 లీటర్ల నీటిలో కలపడంతోపాటు 10 లీటర్ల ఆవుమూత్రం వేసి ఒక ఎకరా పైరుకు పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు, శ్రీకాళీమాత మహిళా సంఘం సభ్యులు, మహిళా రైతులు తదితరులు పాల్గొన్నారు.



శిలగాంలో బ్రహ్మాస్త్రం తయారీపై అన్నదాతలకు అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

?: నందిగాంలోని శిర్డీసాయి ఆలయం ఎదురుగా ఉన్న విద్యుత్తు నియంత్రిక రక్షణ కంచె లేకపోవడంతో ప్రమాదకరంగా మారింది. అధికారులు స్పందించాలి.

– ప్రగడ కిరణ్‌కుమార్, స్థానికుడు

● క్షేత్రస్థాయిలో పరిశీలించి, సిబ్బందికి తెలియజేస్తాం. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. - నేతాజీ, ఏఈ, విద్యుత్తు శాఖ

– న్యూస్‌టుడే, నందిగాం

టెక్కలి

●టెక్కలి ●నరసన్నపేట ●పాతపట్నం

మంచు దుప్పటి



జలుమూరు, న్యూస్‌టుడే: మండలంలోని పలు ప్రాంతాల్లో గురువారం తెల్లవారుజామున మంచు దట్టంగా కురిసింది. దీంతో నారాయణవలస సంతకు వచ్చే వ్యాపారులతో పాటు, తిలారు రైల్వే నిలయం వద్ద ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

తిలారు రైల్వే గేటు సమీపంలో కురుస్తున్న మంచు

పరాశక్తి లలితా.. శివానంద చరిత



నరసన్నపేట మండలం మీసాపురంలో..



టెక్కలి ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో అష్టాదశ అవతారాల్లో అమ్మవారు



శ్రీముఖలింగంలో సామూహిక కుంకుమ పూజలు

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం పలుచోట్ల ఘనంగా ప్రారంభమయ్యాయి. అష్టాదశ అవతారాల్లో భక్తులు ఏర్పాటు చేసిన అమ్మవారి రూపాలు ఆకట్టుకుంటున్నాయి. మండపాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. – న్యూస్‌టుడే బృందం



విద్యుద్దీపాల అలంకరణలో పాతపట్నం నీలమణిదుర్గ అమ్మవారి ఆలయం

సంపద సృష్టికి అడుగులు..!



ఇటీవల మహాశింగిలో ప్రారంభించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం

– న్యూస్‌టుడే, సారవకోట

తెదేపా హయాంలో 2014- 19 మధ్య ఉన్నతమైన ఆశయంతో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. సారవకోట మండలంలో 35 పంచాయతీలు ఉండగా 25 చోట్ల వీటి నిర్మాణాలు పూర్తయ్యాయి. వైకాపా పాలనలో ఇవి పూర్తిగా నిర్లక్ష్యానికి గురయ్యాయి. చెత్త సేకరణ జరిగిందే తప్ప కేంద్రాలకు చేరలేదు. గ్రామాల్లో 250 కుటుంబాలకు ఒక హరిత రాయబారిని నియమించి వారి ద్వారా చెత్తను సేకరించి కేంద్రాలకు తరలించాలి. తడి చెత్త నుంచి సేంద్రీయ ఎరువు తయారు చేయాలి. పొడి చెత్తను విక్రయించి ఆదాయం సమకూర్చాలన్నది ప్రభుత్వ ఆశయం. కానీ ఇది ఎక్కడా అమలు కాలేదు. నిర్మించిన కేంద్రాలు వినియోగంలో లేవు. సేకరించే చెత్త గ్రామ సమీపాల్లో రహదారుల పక్కనే కుప్పలుగా వేసి నిప్పు పెడుతున్నారు. ఈ విధానానికి స్వస్తి పలకాలనే ఆలోచనతో ప్రస్తుత ప్రభుత్వం ఈ కేంద్రాలను తిరిగి ప్రారంభించాలని నిర్ణయించింది. అక్టోబర్ 2న కొన్నింటిని ప్రారంభించగా.. అసంపూర్తిగా ఉన్న నిర్మాణాలను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటుంది.

ఇదీ పరిస్థితి..



బుడితిలో గాంధీ జయంతి రోజున ప్రారంభం

● మహాశింగి, బద్రి గ్రామాల్లో ఇటీవల కేంద్రాలను వినియోగంలోకి తెచ్చారు. బుడితిలో అక్టోబర్ 2న సర్పంచి పొన్నాన శంకరరావు ప్రారంభించారు. అలుదు పంచాయతీకి చెందిన కేంద్రాన్ని మాకివలస గ్రామ సమీపంలో నిర్మించేందుకు పనులు ప్రారంభించారు. పిల్లర్ల దశలోనే గత కొన్ని సంవత్సరాలుగా ఇది నిలిచిపోయింది. కేంద్రం ఎత్తయిన ప్రదేశంలో నిర్మించడంతో పనులు పూర్తయినా చెత్త తరలించడం కష్టమని స్థానికులు చెబుతున్నారు.

● మదనాపురం పంచాయతీకి చెందిన కేంద్రం కిలోమీటరు దూరంలో ఉన్న చంద్రయ్యపేట గ్రామానికి సమీపంలో ఉంది. ఇక్కడి కేంద్రానికి చెత్త తరలించే పరిస్థితి లేదు. ఇదే పరిస్థితి వాండ్రాయి తదితర పంచాయతీల్లోనూ నెలకొంది. సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అన్నింటినీ వినియోగంలోకి తెస్తాం

మండలంలో కొన్ని పంచాయతీల్లో నిర్మాణాలు జరగలేదు. కేంద్రాలు అందుబాటులో ఉన్న చోట అక్టోబర్ 2 నుంచి చెత్త చేర్చి సంపద సృష్టించాలని సిబ్బందికి సూచించాం. నిరుపయోగంగా ఉన్న కేంద్రాలను తిరిగి ప్రారంభించాలని చెప్పాం. ప్రభుత్వ సూచనల మేరకు సంపద సృష్టించేందుకు చర్యలు తీసుకుంటాం.

– రేణుక, ఈవోపీఆర్డీ, సారవకోట

ఉపాధిహామీ అధికారుల విచారణ

కొత్తూరు, న్యూస్‌టుడే: మండలంలోని కుంటిభద్ర, గూనభద్ర కాలనీ పంచాయతీల్లోని ఉపాధి క్షేత్ర సహాయకులపై ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదుల మేరకు అధికారులు గురువారం విచారణ చేశారు. కలెక్టర్ నుంచి వచ్చిన ఆదేశాల మేరకు ఏపీడీ పంచాది రాధ ఆయా గ్రామాల్లో వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. ఏపీవో ఎన్.ప్రేమలత పాల్గొన్నారు.



కుంటిభద్రలో గ్రామస్థులతో మాట్లాడుతున్న ఏపీడీ పంచాది రాధ, ఏపీవో ప్రేమలత

ఆలయ అభివృద్ధికి తోడ్పడాలి

నరసన్నపేట, న్యూస్‌టుడే: సత్యవరం గ్రామంలోని ఉమా కామేశ్వరాలయం అర్చకులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు నరసన్నపేటలో గురువారం వినతిపత్రం అందించారు.



ఇంకా రంగులు మారలే..!

కొత్తూరు మండలంలోని కొన్ని గ్రామాల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు వైకాపా జెండాను పోలిన రంగులే నేటికీ దర్శనమిస్తున్నాయి. మాకవరం సమీపంలోని కేంద్రాన్ని చిత్రంలో చూడవచ్చు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా పరిస్థితి ఇలాగే ఉండటంపై పలువురు పెదవి విరుస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని పీఆర్ ఏఈ దుర్గాప్రసాద్ వద్ద ప్రస్తావించగా క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, కొత్తూరు



ఎక్కడి మురుగు అక్కడే



రామయ్యవలసలో ప్రధాన రహదారి పక్కన మురుగు నిలిచి పోవడంతో స్థానికులు, వాహనదారులు అవస్థలు పడుతున్నారు. దోమలు, దుర్వాసనతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అధికారులు స్పందించాలని కోరుతున్నారు. వర్షం పడితే పరిస్థితి అధ్వానంగా మారుతుందని వాపోతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కాలువ ఏర్పాటు చేయాలని ర.భ.శాఖ అధికారులను కోరుతామన్నారు.

– న్యూస్‌టుడే, పోలాకి

దారుణ దారి.. మారదా మరి

నందిగాం మండలం పెంటూరు, వజ్రపుకొత్తూరు మండలం పొల్లాడ రహదారిపై బడబంద కూడలి నుంచి కోటిపల్లి, రౌతుపురం రైల్వేహాల్టు వరకు ఉన్న సుమారు 4.5 కి.మీ. మట్టి రహదారి గోతులమయంగా మారింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. కనీసం మరమ్మతులైనా చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రతిపాదనలు పంపించామని నిధులు మంజూరైతే పనులు చేపడతామని పీఐయూ ఏఈ మోహన్ పేర్కొన్నారు.

– న్యూస్‌టుడే, నందిగాం



మోక్షానికి నోచుకునేదెప్పుడు..?



బుడితి ఉన్నత పాఠశాలలో 3 అదనపు తరగతి గదుల పనులు చివరి దశలో నిలిచిపోయాయి. ప్రభుత్వం కేటాయించిన నిధులతో 6 నెలల కిందట నాటి విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీ అధ్యక్షుడు సురేష్ పనులు పూర్తి చేశారు. భవనాలకు అవసరమైన కిటికీలు, తలుపులు ప్రభుత్వం సరఫరా చేయాల్సి ఉంది. తరగతి గదుల కొరతతో కళావేదికపై ఉపాధ్యాయులు పాఠాలు బోధిస్తున్నారు. పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఎంఈవో ఎం.వెంకటరమణ చెప్పారు. – న్యూస్‌టుడే, సారవకోట

అదే మార్గం.. అవే అవస్థలు



కొత్తూరులో ట్రాఫిక్ ఇబ్బందులతో వాహనదారులు, పాదచారులు అవస్థలు పడుతున్నారు. ఇసుక అక్రమ రవాణాలో పట్టుబడిన లారీలను పోలీసులు ప్రధాన రహదారి పక్కన నిలపడం, ఒడిశా నుంచి ఇనుప కడ్డీలతో భారీ వాహనాలు తిరుగుతుండటంతో ఇతర వాహనాలు వెళ్లేందుకు అవకాశం లేకుండా పోతుంది. సంబంధిత అధికారులు స్పందించి, సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై ఎస్ఐ అహ్మద్ మాట్లాడుతూ ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, కొత్తూరు

మళ్లీ వస్తాం కొత్తమ్మ తల్లీ..!



దర్శనానికి క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: కోటబొమ్మాళిలో వైభవంగా జరిగిన కొత్తమ్మతల్లి జాతర మహోత్సవాలు గురువారంతో ముగిశాయి. అంతటా ఆధ్యాత్మిక వాతావరణం సంతరించుకుంది. అమ్మ సేవలో భక్తజనులు పరవశించిపోయారు. చివరి రోజు వేకువజాము నుంచే దర్శనానికి బారులు తీరారు. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.



ఆలయానికి వెళ్లే మార్గంలో రద్దీ



ప్రతిభ చూపిన విద్యార్థులతో అధ్యాపకులు

సందడిగా స్వాగతోత్సవం

పాతపట్నం, న్యూస్‌టుడే: పాతపట్నం మహేంద్ర జూనియర్ కళాశాలలో గురువారం స్వాగతోత్సవాన్ని సందడిగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన విశ్రాంత ఉపాధ్యాయుడు రేగేటి చంద్రమోహన్, కళాశాల డైరెక్టర్ ఎస్.మధుబాబు మాట్లాడుతూ.. విద్యా ప్రగతికి ఇంటర్ ఎంతో కీలకమైందని పేర్కొన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో 400 పైబడి మార్కులు సాధించిన విద్యార్థులకు జ్ఞాపికలు అందించారు. ప్రిన్సిపల్ ఎం.ఆంజనేయులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నైపుణ్యాలు పెంచుకుంటేనే ఉపాధి

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే : విద్యార్థి దశ నుంచి చదువుతో పాటు నైపుణ్యాలు పెంచుకుంటేనే ఉపాధి అవకాశాలు లభిస్తాయని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ బి.సతీష్‌కుమార్ అన్నారు. శిక్షణ ఫౌండేషన్ నుంచి హాజరైన అప్పారావు ప్రేరణమిత్ర యాప్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. బీసీడీఈ సమన్వయకర్త అజయ్‌కుమార్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ వి.ల్యూక్ పాల్, లీలాపద్మజ పాల్గొన్నారు.

వీధి దీపాలకు మరమ్మతులు

స్పందనకు వందనం

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే : స్థానిక కోటచిన్నబాబు క్వార్టర్స్‌లో వీధి దీపాలకు పంచాయతీ అధికారులు మరమ్మతులు చేశారు. వీధి దీపాలు వెలగకపోవడంతో రాత్రి వేళ రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోయారు. దీనిపై ఇటీవల 'ఈనాడు'లో వార్త ప్రచురితమవడంతో అధికారుల స్పందించి, సమస్యను పరిష్కరించారు.

108 వాహనాల తనిఖీ

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే : 108 వాహనాల్లో డివిజన్ పర్యవేక్షణ అధికారి ఎం.రంగప్రసాద్ గురువారం తనిఖీలు నిర్వహించారు. పరికరాలు, మందులు, దస్త్రాలను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అంకితభావంతో సేవలు అందించాలన్నారు.

పోలవరం విద్యార్థుల ప్రతిభ



టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: ప్రభుత్వం నిర్వహించిన స్వర్ణాంధ్ర- 2047 పోటీల్లో పోలవరం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు మండల, డివిజన్, జిల్లాస్థాయిల్లో ప్రతిభ చూపడంపై పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, టెక్కలి డివిజన్ ఉపవిద్యాశాఖాధికారి పి.విలియమ్స్ హర్షం వ్యక్తంచేశారు. వ్యాసరచన పోటీల్లో పదోతరగతి విద్యార్థిని కె.జాహ్నవి జిల్లాస్థాయిలో ప్రథమస్థానం దక్కించుకోగా, వక్తృత్వ పోటీల్లో పి.దేవి, బి.లావణ్య తృతీయ స్థానంలో నిలిచారు. వారిని ప్రధానోపాధ్యాయుడితో పాటు శిమ్మన్న, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

అంతర్జాతీయ సదస్సు గోడప్రతుల ఆవిష్కరణ



టెక్కలి, న్యూస్‌టుడే : టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించనున్న ఐసీఐపీడీఐఎంఎస్- 2024 అంతర్జాతీయ సదస్సుకు సంబంధించి గోడప్రతులను కళాశాల డైరెక్టర్ నాగేశ్వరరావు గురువారం ఆవిష్కరించారు. డిసెంబరు 4, 5 తేదీల్లో విద్యార్థులు, బోధనా సిబ్బంది నైపుణ్యాలు మెరుగుపర్చేందుకు సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, వై.రమేష్, ప్రసన్న, శ్రీరాములు, జయంతిరావు పాల్గొన్నారు.

సాగులో సాంకేతికత అవసరం



పింద్రువాడలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో సంధ్య, సిబ్బంది



కోమర్తిలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో పాల్గొన్న జేడీ త్రినాథస్వామి, శాస్త్రవేత్తలు

హిరమండలం, ఎల్ఎన్‌పేట, టెక్కలి పట్టణం, నందిగాం, ఎత్తురాళ్లపాడు(కోటబొమ్మాళి), నరసన్నపేట, జలుమూరు, న్యూస్‌టుడే: టెక్కలి, పాతపట్నం, నరసన్నపేట నియోజకవర్గాల వ్యాప్తంగా గురువారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ అధికారులు నిర్వహించారు. ఎరువులను తగిన మోతాదులో మాత్రమే వినియోగించాలని అన్నదాతలకు సూచించారు. వ్యవసాయ సాగులో సాంకేతిక విధానాలు అవసరమని చెప్పారు.



సమస్యల పరిష్కారానికి కృషి

నరసన్నపేట, జలుమూరు, న్యూస్‌టుడే: నరసన్నపేట మేజర్ పంచాయతీ సమస్యల పరిష్కారానికి రాజకీయాలకు అతీతంగా కృషి చేయాలని సర్పంచి బూరెల్ల శంకరరావు అన్నారు. స్థానిక గాంధీ కళా మండపంపై గురువారం గ్రామసభ జరిగింది. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులపై చర్చించారు. ఉపసర్పంచి సాసుపల్లి కృష్ణబాబు, మాజీ సర్పంచి గొద్దు చిట్టిబాబు, ఈవో దాక్షాయణి పాల్గొన్నారు. ● జలుమూరు మండలంలో 40 పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం

•శ్రీకాకుళం •ఆమదాలవలస •ఎచ్చెర్ల

రాష్ట్ర విద్యార్థుల అవకాశాలను కాపాడాలని సీఎంకు వినతి



ఎంబీబీఎస్ సీట్ల భర్తీలో రాష్ట్ర కోటా సీట్ల కేటాయింపులో జాతీయ ప్రతిభా అభ్యర్థులు ప్రభావితం చేస్తుండటం వల్ల రాష్ట్రంలో మంచి ర్యాంకు వచ్చి ప్రతిష్ఠాత్మకమైన విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో సీట్లు కోల్పోతున్నారని, ఈ సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడి దృష్టికి తీసుకెళ్లారు. అమరావతిలో గురువారం ఆయన ముఖ్యమంత్రిని కలిసి ఈ సమస్యను వివరించారు. జాతీయ ప్రతిభ ర్యాంకులు పొందిన అనేక మంది విద్యార్థులు రాష్ట్ర కోటా కింద ఉన్న సీట్లు పొందుతున్నారని, దీని వల్ల మన రాష్ట్ర విద్యార్థులకు రావాల్సిన 500 సీట్లు జాతీయ ర్యాంకర్లకు వెళ్తున్నాయని చెప్పారు. రాష్ట్ర విద్యా వ్యవస్థ ఎంబీబీఎస్, పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించిన జాతీయ, రాష్ట్ర ర్యాంకర్లకు సమానమైన ప్రాధాన్యం ఇచ్చేలా అన్ని వర్సిటీలతో పాటు ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్‌కు మార్గదర్శకాలు ఇచ్చేలా చర్యలు తీసుకొని రాష్ట్ర విద్యార్థుల అవకాశాలను కాపాడాలని కోరారన్నారు. - న్యూస్‌టుడే, ఎచ్చెర్ల

నేడు ప్రజాదర్బార్

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరపాలక సంస్థ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10 నుంచి 5 గంటల వరకు ఎమ్మెల్యే గొండు శంకర్ ఆధ్వర్యంలో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిషనర్ పి.వి.వి.డి.ప్రసాదరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి విడతగా 22 నుంచి 42 డివిజన్ల పరిధిలోని ప్రజల నుంచి మాత్రమే వినతులు స్వీకరించనున్నట్లు చెప్పారు. ఆయా డివిజన్ల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తెరపై ఈనాడు

● కిరణ్: రామ్‌నగర్ బన్నీ ● శ్రీలక్ష్మీ: సత్యం సుందరం ● కిన్నెర సినిమాక్స్: దేవర ● ఎస్వీసీ (రామలక్ష్మణ): దక్షిణ ● సూర్యమహల్: స్వాగ్ ● సరస్వతి: దేవర ● చంద్రమహల్: మత్తు వదలరా-2 ● మారుతి: చిట్టి పొట్టి

– న్యూస్‌టుడే, అరసవల్లి

పురపాలికలో ఇంటింటికీ తాగునీరు



సరుబుజ్జిలి మండలం అల్లాజీపేట వద్ద పంప్‌హౌస్ పైపు లైన్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కూన రవికుమార్

ఆమదాలవలస గ్రామీణం, సరుబుజ్జిలి, ఆమదాలవలస పట్టణం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వ హయాంలో 23 వార్డులకు పైపులైన్లు, ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేసే దిశగా పుష్కలంగా అందించనున్నట్లు ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. ఆమదాలవలస మున్సిపాల్టీకి తాగునీరు అందించడంలో గత వైకాపా ప్రభుత్వం విఫలమైందని పేర్కొన్నారు. గురువారం ఆమదాలవలస మున్సిపాల్టీకి తాగునీరు అందిస్తున్న సరుబుజ్జిలి మండలం అల్లాజీపేట వద్ద ఉన్న పంప్ హౌస్‌ను, ఆమదాలవలస మండలం చెవ్వాకులపేట, రామచంద్రాపురం వద్ద పైపులైన్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రెండు రోజులుగా మున్సిపాల్టీలో వివిధ ప్రాంతాలకు బురదగా వస్తుందని, దీంతో ఆకస్మికంగా పరిశీలించినట్లు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ పూజారి బాలాజీ ప్రసాద్, ఏఈ అప్పలనాయుడు, పి.వి.కె.రాజు, తెదేపా నాయకులు తమ్మినేని విద్యాసాగర్, సంపతిరావు మురళీ, అధికారులు తదితరులు పాల్గొన్నారు. ● వైకాపా పాలకుల నిర్లక్ష్యంతోనే మున్సిపాల్టీలో అభివృద్ధి కొరవడిందని ఎమ్మెల్యే రవికుమార్ అన్నారు. తాగునీరు ప్రధాన పంపుహౌస్‌తో పాటు పట్టణంలోని ప్రధాన మురుగు కాలువలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో తెదేపా హయాంలో తాగునీరు అందించే ప్రధాన పంపుహౌస్‌లో మూడు మోటార్లు ఉండేవని, నిరంతరంగా తాగునీరు అందించేవారమన్నారు.

ఈ మలుపులు.. ప్రమాదానికి పిలుపులు..!



మర్రిపాడు సమీపంలో ప్రమాదకర మలుపు

–న్యూస్‌టుడే, బూర్జ, ఆమదాలవలస గ్రామీణం, పొందూరు

ఆమదాలవలస నియోజకవర్గంలో బూర్జ, పొందూరు, ఆమదాలవలస మండలాల్లో పలు రహదారుల్లో మలుపులు ప్రమాదానికి పిలుపుగా మారాయి. ఆయా ప్రాంతాల్లో తరచూ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. మలుపుల వద్ద రహదారికి ఇరువైపులా దట్టంగా పనికిరాని మొక్కలు పెరిగి ముందుకు చొచ్చుకు రావడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనరాని పరిస్థితి నెలకొంది. ప్రమాదాల నివారణకు ఆర్‌అండ్‌బీ, రోడ్డు రవాణా, పోలీసు శాఖల అధికారులు సంయుక్తంగా చర్యలు చేపట్టాల్సి ఉంది.

నియోజకవర్గంలో ఇలా..

● బూర్జ మండలంలో పలు ప్రాంతాల్లో మలుపులు ప్రమాదాలకు పిలుపులుగా మారుతున్నాయి. శ్రీకాకుళం-పాలకొండ ప్రధాన రహదారిలో తుడ్డలి-మర్రిపాడు, కొండపేట-పెద్దపేట, అప్పలపేట, నీలాదేవిపురం కూడలి, టీఆర్‌రాజుపేట - కొల్లివలస, లచ్చయ్యపేట-సింగన్నపాలెం, ఉప్పినివలస, ఉప్పినివలస-వైకుంఠపురం గ్రామాల మధ్య మలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనపడక ప్రమాదాలకు గురవుతున్నట్లు ద్విచక్ర వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే కూడలి బూర్జ, మాదివలస, నీలాదేవిపురం, సరుబుజ్జిలి, అల్లెన, డొంకలపర్త, తదితర రహదారులు వద్ద ప్రమాదకరంగా ఉన్నాయి.

● పొందూరు మండలంలో రాపాక, కింతలి, కనిమెట్ట, బురిడికంచరాం, తోలాపి, వీఆర్‌గూడెం, బాణాం, లక్ష్మీపురం, సింగూరు, తాడివలస, పిల్లలవలస, తదితర గ్రామాల రహదారి మలుపుల వద్ద అదే పరిస్థితి.

● సరుబుజ్జిలి మండలంలో అలికాం-బత్తిలి రహదారిలో ప్రధానంగా కొండవలస, సూర్యనారాయణపురం, షళంత్రి కూడలి, కొమ్ముసారపల్లి రహదారిలో బుడ్డివలస, సరుబుజ్జిలి, ఇస్సలపాలెం, సుబ్బపేట, పెద్దమాలపేట, సిందువాడ, మూలసవలాపురం, పెద్దసవలాపురం, పాలవలస, పురుషోత్తపురం, తదితర గ్రామాలకు చేరుకునే మార్గాల్లోని మలుపులతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

● ఆమదాలవలస మండలంలోని బొబ్బిలిపేట, తిమ్మాపురం, లక్ష్మిపురపేట, అక్కులపేట, మండాది, కృష్ణాపురం, పార్వతీశంపేట, జొన్నవలస, దన్నానపేట, మునగవలస, చింతాడ, చెవ్వాకులపేట, రామచంద్రాపురం, కనుగులవలస, తదితర గ్రామాలకు చేరుకునే దారుల్లో ప్రమాదకర మలుపులు ఉండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి.

కొన్ని ప్రమాద ఘటనలివి

● గత ఏడాది బూర్జ మండలంలోని మర్రిపాడు సమీపంలో మలుపు కారణంగా బొగ్గులారీ బోల్తా పడింది. దీంతో డ్రైవర్, సహాయకుడు గాయాలపాలయ్యారు.

● సరుబుజ్జిలి మండలం పురుషోత్తపురం మలుపు వద్ద ద్విచక్ర వాహనంపై వస్తున్న వ్యక్తిని ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ ఢీకొనడంతో మృతి చెందాడు.

● ఆమదాలవలస మండలంలోని ప్రధాన రహదారిలో మండాది వద్ద మలుపు కారణంగా ఉపాధిహామీ పనులు ముగించుకొని ఇంటికి నడిచి వస్తున్న నలుగురు మహిళల పైనుంచి లారీ వెళ్లిన విషయం తెలిసిందే.

సూచికలు ఏర్పాటు చేస్తాం

నియోజకవర్గం పరిధి ప్రధాన, గ్రామీణ రహదారుల్లో ఉన్న మలుపుల వద్ద పరిశీలించి ప్రమాద సూచికలు, హెచ్చరిక బోర్డులు లేని చోట్ల వాటిని ఏర్పాటు చేసేలా చర్యలు చేపడతాం.

–జగన్నాథరావు, డీఈ, ఆర్‌అండ్‌బీ, ఆమదాలవలస

క్రీడల్లో బీఆర్ఏయూకు గుర్తింపు వచ్చేలా చర్యలు తీసుకోవాలి

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: డా. బి.ఆర్.అంబేడ్కర్ విశ్వవిద్యాలయానికి క్రీడల్లో గుర్తింపు వచ్చేలా వర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం, అనుబంధ కళాశాల వ్యాయామ అధ్యాపకులు చర్యలు తీసుకోవాలని వర్సిటీ ఉప కులపతి ఆచార్య కె.ఆర్.రజని అన్నారు. వర్సిటీలోని పాలక మండలి సమావేశ గదిలో గురువారం వర్సిటీ స్థాయి స్పోర్ట్స్ బోర్డు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరంలో ఏ క్రీడల్లో పాల్గొంటున్నాం, వాటి షెడ్యూలు, శిక్షణ తదితర అంశాలపై సరైన ప్రణాళికతో ముందుకు వెళ్లాలన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర, జాతీయ స్థాయి అంతర్ వర్సిటీ క్రీడా పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు ప్రోత్సాహం, నిధులు, తదితర అంశాలపై సభ్యులతో చర్చించారు. రిజిస్ట్రార్ పీలా సుజాత, స్పోర్ట్స్ డీన్ యు.కావ్యజ్యోత్స్న, వర్సిటీ స్పోర్ట్స్ కార్యదర్శులు ఎం.శ్రీనివాసరావు, ఎ.భాస్కరరావు, బోర్డు సభ్యులు ఎ.పల్లవి, పి.మధు, చక్రవర్తి, కె.శ్రీధరరావు, ఎ.మోహన్‌రాజ్, సీహెచ్.కేశవనారాయణ పాల్గొన్నారు.

తెదేపా తరఫున పోటీలో శ్రీరాములు

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: జిల్లా మత్స్యకార సహకార సంఘ అధ్యక్షుడిగా పోటీ చేసేందుకు పలు మత్స్యకార సంఘాల సభ్యులు తన పేరును సూచించారని చికటి శ్రీరాములు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. తెదేపా తరపున మత్స్యకార నాయకులు తన పేరును నిర్ణయించారని చెప్పారు. ఈ విషయాన్ని మంత్రి అచ్చెన్నాయుడితో పాటు జిల్లా మత్స్యశాఖాధికారి శ్రీనివాసరావును దృష్టికి తీసుకెళ్లినట్లు వివరించారు.

నేడు బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడి పర్యటన

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం శుక్రవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 10 గంటలకు కలెక్టర్‌తో భేటీ కానున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు విద్యార్థుల బస్‌పాస్‌ల జారీపై ఆర్టీసీ డిపో మేనేజర్లతో సమీక్షిస్తారు. దివ్యాంగ బాలలకు అమలు చేస్తున్న వివిధ సంక్షేమ కార్యక్రమాలపై ఆ శాఖ అధికారులతో సమావేశమవుతారు. 3 గంటలకు ఆర్ఐవో నేతృత్వంలో జిల్లా కళాశాలల యాజమాన్య ప్రిన్సిపల్ పాత్రపై జరగనున్న అవగాహన కార్యక్రమంలో పాల్గొంటారు.

రాకపోకలకు ఇక్కట్లు

రణస్థలం మండలం రామతీర్థాల కూడలి నుంచి పోలీసు స్టేషన్ కూడలికి వెళ్లే రహదారి పైన, గొల్లవీధి, లక్ష్మీనగర్ కూడళ్ల వద్ద రహదారి పైకి మురుగునీరు ప్రవహించడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. రణస్థలం మండల కేంద్రంలో దీని పైనుంచి మండల వాసులు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ విషయమై మండల పంచాయతీ అధికారి ప్రభాకర్ దృష్టికి 'న్యూస్‌టుడే' తీసుకువెళ్లగా క్షేత్ర స్థాయిలో పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

– న్యూస్‌టుడే, ఎచ్చెర్ల(రణస్థలం)



పొంచి ఉన్న ప్రమాదం



పొందూరు మండలం తోలాపి గ్రామంలో ప్రాథమికోన్నత పాఠశాల వద్ద ఉన్న నియంత్రిక (ట్రాన్స్‌ఫార్మర్) ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. దీని చుట్టూ పనికిరాని మొక్కలు పెరిగి అల్లుకుపోవడంతో ప్రమాదకరంగా మారింది. పాఠశాల ఆవరణలో ఇది ఉండటంతో పాటు రక్షణ కంచె లేకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై విద్యుత్తుశాఖ ఏఈ దుర్గాప్రసాద్ వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా పరిశీలించి తగిన చర్యలు చేపడతామన్నారు.

– న్యూస్‌టుడే, పొందూరు, పొందూరు గ్రామీణం

ఎక్కడి మురుగు అక్కడే

శ్రీకాకుళం నగరం బలగ ప్రాంతంలోని పలు వీధి కాలువల్లో పూడిక పేరుకుపోవడంతో మురుగునీరు ఎక్కడికక్కడ నిల్వ ఉండిపోతోంది. దీంతో స్థానికులు దోమలు, దుర్వాసనతో అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి సమస్యకు పరిష్కారం చూపాలని కోరుతున్నారు. ఈ విషయమై నగరపాలక సంస్థ కమిషనర్ పి.వి.వి.డి.ప్రసాదరావు మాట్లాడుతూ కాలువల్లో పూడిక తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

– న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం



తీగల తొలగించారు

స్పందనకు వందనం

సరుబుజ్జిలి మండలంలోని నందికొండ కాలనీ మధ్య వీధిలో విద్యుత్తు స్తంభానికి పేరుకుపోయిన తీగలు, పొదలను సిబ్బంది తొలగించారు. గురువారం 'ఎంత నిర్లక్ష్యమో..!' శీర్షికతో 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి విద్యుత్తు శాఖ ఏఈ అప్పలనాయుడు స్పందించి సిబ్బందితో స్తంభానికి అల్లుకున్న తీగలు, పొదలను తొలగింపజేయించారు. దీంతో స్థానికులు అభినందనలు తెలిపారు.

–న్యూస్‌టుడే, సరుబుజ్జిలి



నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

శ్రీకాకుళం నగరానికి చెందిన కిల్లంశెట్టి తవిటమ్మ జ్ఞాపకార్థం ఆమె కుమారులు శ్రీనివాస్, సురేష్ న్యూకాలనీలోని సత్యసాయి మందిరంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం అందించారు. ఆ మొత్తాన్ని ఎమ్మెల్యే గొండు శంకర్ చేతులమీదుగా మందిరం ప్రతినిధి భరద్వాజ్‌కు గురువారం అందజేశారు. అంధవరపు ప్రసాద్, సంతోష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు. –న్యూస్‌టుడే, శ్రీకాకుళం సాంస్కృతికం



ఎమ్మెల్యే గొండు శంకర్ చేతుల మీదుగా చెక్కు అందిస్తున్న కిల్లంశెట్టి సోదరులు

సొంత నిధులతో పారిశుద్ధ్య పనులు



రొట్టవలసలో యంత్రంతో పనులు చేయిస్తున్న తెలుగు యువత అధ్యక్షుడు తాడేల రాజారావు

సరుబుజ్జిలి, న్యూస్‌టుడే: మండలంలోని రొట్టవలస గ్రామంలో సొంత నిధులు వెచ్చించి తెలుగు యువత అధ్యక్షుడు తాడేల రాజారావు గురువారం పారిశుద్ధ్య పనులు చేయించారు. గ్రామంలో పారిశుద్ధ్యం పనులు చేయించాలని పలు మార్లు పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకునే నాథుడే కరవయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను కొందరు ఆయన దృష్టికి తీసుకురావడంతో కాలువల్లో పేరుకుపోయిన పూడిక, పనికిరాని మొక్కలను పొక్లెయిన్ సాయంతో తొలగింపజేయించి పరిసరాలు శుభ్రం చేయించారు. దీంతో గ్రామ ప్రజలు రాజారావును అభినందించారు.

ఆర్టీసీ విజిలెన్స్ ఎస్సై బదిలీ

అరసవల్లి, న్యూస్‌టుడే: జిల్లాలో ఆర్టీసీ విజిలెన్స్ ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న కె.చంద్రినాయుడును విజయనగరానికి బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఆయనను గురువారం జిల్లా ప్రజారవాణాధికారి(డీపీటీవో) విజయ్‌కుమార్ గురువారం సత్కరించారు. కార్యక్రమంలో పీవో కృష్ణకుమారి, హెడ్ గార్డులు రామకృష్ణ, సుబ్రహ్మణ్యం, జి.రామారావు, విశ్వనాథం, రామ్మోహనరావు పాల్గొన్నారు.

ఎంపీడీవోల బాధ్యతల స్వీకరణ

సరుబుజ్జిలి, పొందూరు,న్యూస్‌టుడే: సరుబుజ్జిలి మండల పరిషత్తు అభివృద్ధి అధికారిగా ఎం.పావని గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల కొత్తూరు ఎంపీడీవోగా పనిచేసి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన మురళీమోహన్‌కుమార్ సారవకోట బదిలీపై వెళ్లారు. వీరికి సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ పథకం సిబ్బంది అభినందనలు తెలిపారు.● పొందూరు మండల పరిషత్తు ఎంపీడీవోగా బదిలీపై ఎం.మన్మధరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. గత ఎంపీడీవో హరిహరరావు, సిబ్బంది, ఎంపీపీ ప్రతినిధి కిల్లి నాగేశ్వరరావు, కోటిపల్లి సర్పంచి గురుగుబెల్లి అసిరినాయుడు, రాము తదితరులు ఘనస్వాగతం పలికారు. మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జనని.. శివగామిని..!

శ్రీకాకుళం, ఆమదాలవలస, ఎచ్చెర్ల నియోజకవర్గాల్లోని వివిధ చోట్ల దసరా నవరాత్రి ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి ఈ సందర్భంగా ఆయా చోట్ల మంటపాలలో, దేవాలయాల్లో దుర్గాదేవి విగ్రహాలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. –న్యూస్‌టుడే బృందం



పాత శ్రీకాకుళంలో సంతోషిమాత



కాకివీధిలో ముత్యాలమ్మ తల్లికి అలంకరణ



ఉమాజఠలేశ్వరాలయంలో..



సరుబుజ్జిలి: కొత్తకోటలో ఏర్పాటు చేసిన దుర్గమ్మ విగ్రహం



కొండములగాంలో అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



కొరగాం పంట పొలాల్లో పాల్గొన్న ఏవో, రైతులు

ఆమదాలవలస గ్రామీణం, బూర్జ, న్యూస్‌టుడే, రైతులు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఏవో మెట్ట మోహనరావు అన్నారు. గురువారం మండలంలోని కొర్లకోట గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి పొలాన్ని ఆశిస్తున్న చీడపీడలు, దోమ, తెగుళ్లు, వాటికి నివారణకు ఏ మందులు పిచికారీ చేయాలో వివరించారు. సర్పంచి ప్రతినిధి సనపల అప్పనాయుడు, ఏపీఎం కూర్మారావులతో పాటు అధికారులు, రైతులు పాల్గొన్నారు. ● బూర్జ మండలం కొరగాం, ఉప్పినివలస పంచాయతీల పరిధి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్నిమండల వ్యవసాయాధికారి ఎన్.శ్రీనివాసరావు నిర్వహించారు. దీనిలో యాజమాన్య పద్ధతులు, తెగుళ్ల నివారణకు చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యల గురించి వివరించారు. రైతులు, తదితరులు పాల్గొన్నారు.

గారలో ఇసుక విక్రయాలు ప్రారంభం

గార, న్యూస్‌టుడే: గారలో ప్రభుత్వం ఇసుక విక్రయాలు ప్రారంభించింది. గత కొంతకాలంగా డ్రెడ్జింగ్ పద్ధతిలో ఇసుక తవ్వకాలు చేపట్టినప్పటికీ శాఖాపరంగా అనుమతులు రాలేదు. ఎట్టకేలకు రావడంతో తహసీల్దారు ఎస్.రమణారావు, గనుల శాఖ డీడీ మోహనరావు గురువారం ప్రక్రియను ప్రారంభించారు. ఇసుక కావాల్సినవారు టన్ను ఇసుకకు రూ.340తో పాటు వాహనం, రవాణా ఛార్జీలు అదనంగా చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు.

సమస్యల పరిష్కారానికి గ్రామ సభలు

పొందూరు, పొందూరు గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామ సభల ద్వారా గ్రామాల్లో సమస్యలు పరిష్కరించుకోవచ్చని తెదేపా మండల అధ్యక్షుడు రామ్మోహన్, బాడాన గిరి అన్నారు. పొందూరు మేజర్ పంచాయతీలో గ్రామ సభను గురువారం నిర్వహించారు. సర్పంచి ఆర్.లక్ష్మి, వివిధ శాఖల అధికారులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: జిల్లా ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులుగా జె.కేశవరావు, బి.అప్పలరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శ్రీకాకుళం నగరంలోని జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయ ఆవరణలో గురువారం జరిగిన ఎన్నిక నిర్వహించారు. అసోసియేషన్ కోశాధికారిగా సీహెచ్ విజయ్‌కుమార్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఎన్.లూనీఎస్తర్, కార్యనిర్వహణ కార్యదర్శిగా జి.రాజేశ్, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

గోరింటలో ఉచిత వైద్య శిబిరం



శిబిరంలో పాల్గొన్న వైద్యులు

పొందూరు, న్యూస్‌టుడే: పొందూరు మండలం గోరింట గ్రామంలో ఏపీ శాక్స్ సహకారంతో జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సలహా మేరకు మెడికవర్ వైద్యులు, సిబ్బంది గురువారం 180 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందించారు. ఇందులో భాగంగా హెచ్ఐవీ పరీక్షలు 86 మందికి చేసినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. జిల్లా రిసోర్సు పర్సన్ హనుమంతు నాగభూషణరావు మాట్లాడారు. వైద్యులు కోటి, సూర్య, నీలవేణి, మాధవరావు, జోనల్ సూపర్‌వైజర్ సీహెచ్.ప్రసాద్, గణేష్, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ముస్లింల సమస్యలు పరిష్కరిస్తాం

ఆమదాలవలస గ్రామీణం, న్యూస్‌టుడే: ఆమదాలవలసలోని ముస్లిం మైనార్టీ కుటుంబాల సమస్యలు పరిష్కరిస్తామని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. గురువారం మండలం చెవ్వాకులపేట వద్ద ఎమ్మెల్యే రవికుమార్‌ను ముస్లిం నాయకులు అబ్బూ, జిలానీలతో పాటు ఇతర నాయకులు కలిశారు. వారి సమస్యపై వినతులు అందజేశారు. ❖ ఆమదాలవలస మండల, మున్సిపాల్టీలో ఉన్న ప్రభుత్వ స్థలాలను పూర్తి స్థాయిలో గుర్తించి నివేదిక అందించాలని ఎమ్మెల్యే రవికుమార్ అన్నారు. ఆమదాలవలస మండలం శ్రీరామవలస వద్ద ఉన్న ప్రభుత్వ స్థలాన్ని ఆయన పరిశీలించారు.

సాంకేతికతపై అవగాహన అవసరం



ప్రదర్శనను తిలకిస్తున్న జి.వి.స్వామినాయుడు

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: విద్యార్థులకు సాంకేతిక విజ్ఞానంపై అవగాహన అవసరమని గురజాడ విద్యాసంస్థల అధినేత జి.వి.స్వామినాయుడు అన్నారు. శ్రీకాకుళం గ్రామీణ మండలం మునసబుపేటలోని గాయత్రి కళాశాలలో గురువారం ఎలక్ట్రానిక్స్, భౌతికశాస్త్ర విభాగాలు సంయుక్తంగా ఏర్పాటు చేసిన ప్రాజెక్టు ఎక్స్‌పో 2కే24 ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ప్రాజెక్టులను తిలకించి విద్యార్థులను అభినందించారు. కళాశాల ప్రిన్సిపల్ డా.పులఖండం శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపల్ కె.వి.వి.సత్యనారాయణ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

డీటీసీ బాధ్యతల స్వీకరణ



ఉప రవాణా కమిషనర్ విజయసారథికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సిబ్బంది

గుజరాతీపేట(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: జిల్లా ఉప రవాణా కమిషనర్(డీటీసీ)గా ఎ.విజయసారథి గురువారం బాధ్యతలు స్వీకరించారు. విజయవాడలో పని చేసిన ఈయన బదిలీల్లో భాగంగా ఇక్కడికి వచ్చారు. ప్రాంతీయ రవాణాశాఖాధికారి ఎన్.ఆర్.ఎం.రాజు, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు పి.వి.గంగాధర్, అనీల్, తదితరులు ఆయనను కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

బహిరంగ ప్రకటన

నా క్లయింటయిన బ్రాంచ్ మేనేజర్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, రామలక్ష్మణ జంక్షన్, బ్రాంచ్ కోడ్: 11105, శ్రీకాకుళం వారు ఇచ్చిన భోగట్టాపై ఈ ప్రకటన ఇచ్చుచున్నాము.

శ్రీకాకుళం జిల్లా మరియు మండలం, రాగోలు గ్రామ కాపురస్తులు **తాడి ఝాన్సీరాణి** W/o. **రావాక కమల్‌హాసన్**, D/o. లేటు **సుందరరావు** గారు దిగువ షెడ్యూల్ దాఖలా ఆస్థి హామీపై ఋణము మంజూరు కొరకు దరఖాస్తు చేసియున్నారు. దరఖాస్తుదారు దిగువ షెడ్యూల్ దాఖలా ఆస్థిని తనయొక్క తోబుట్టువులైనటువంటి (1) **తాడి విజయభూషణరావు** S/o. లేటు **సుందరరావు** మరియు (2) **తాడి వరప్రసాదరావు** S/o. లేటు **సుందరరావు** గార్లతో కలిపి ఉమ్మడిగా అనగా వారసత్వేన తనయొక్క తల్లిదండ్రుల మరణానంతరం పొందియున్నారు. దిగువ షెడ్యూల్ దాఖలా ఆస్తిలో దరఖాస్తుదారు తనకు వారసత్వేన సంక్రమించిన 1/3 వ వంతు గాక, తన అన్నదమ్ములచే వ్రాయబడిన హక్కు విడుదల దస్తావేజు నెం. 5893/2024, తేది. 12-09-2024 ద్వారా వారియొక్క 2/3వ వంతు హక్కును పొందియున్నారు. దిగువ షెడ్యూల్ దాఖలా ఆస్థిని దరఖాస్తుదారు యొక్క తండ్రి గారైన **తాడి సుందరరావు** గారు క్రయ దస్తావేజు నెం. 701/1998, తేది. 02-05-1998 ద్వారా **ఉల్లాకుల గోవిందమ్మ** వగైరాల వద్ద నుండి ఖాళీ స్థలంగా కొనుగోలు చేసి, డాబా ఇల్లు నిర్మించి, అనుభవించుచూ, తేది. 06-04-2002న ఎట్టి లిఖితంలు వ్రాయకుండా మరణించి ఉన్నారనిన్నీ, సదరు సుందరరావు గారికి దరఖాస్తు దారు మరియు ఆమె అన్నదమ్ములు తప్ప వేరెవ్వరూ వారసులు లేరనిన్నీ, ఈ దరిమిలా దరఖాస్తుదారు పై నుదహరించిన దస్తావేజులు జిరాక్స్ తీయునిమిత్తం, తేది. 19-09-2024న తన ఇంటి నుండి రాగోలు జంక్షన్‌కు వెళుతుండగా, ఎక్కడో మార్గమధ్యలో తన దస్తావేజు యొక్క లింకు దస్తావేజు అయిన క్రయ దస్తావేజు నెం. 701/1998, తేది. 02-05-1998 కలది పడిపోయినదని గ్రహించి, తను ప్రయాణించిన మార్గంలో వాకబు చేసిననూ, ప్రయోజనం లేక అదే రోజున అనగా 19-09-2024న శ్రీకాకుళం రూరల్ పోలీస్ వారికి తగు చర్య నిమిత్తం ఫిర్యాదు చేసియున్నారు. సదరు పోలీసు వారు తగు విచారణ జరిపి తేది. 27-09-2024న సదరు తాడి ఝాన్సీరాణి గారికి NOT TRACED CERTIFICATE జారీ చేసియున్నారు. కావున దిగువ షెడ్యూల్ దాఖలా ఆస్తిపై మరియు పోయిందని చెబుతున్న లింకు దస్తావేజుపై ఎవ్వరికైననూ ఎట్టి అభ్యంతరాలు ఉన్నచో వాటిని నాకు గానీ నా క్లయింటునకు గానీ 7 దినములలో తగు రీతిగా తెలియపరచవలెను, లేనిచో నా క్లయింటు బ్యాంకు వారు దిగువ షెడ్యూల్ దాఖలా ఆస్థిని నిర్వివాదమైన ఆస్థిగా భావించి ఋణమును మంజూరు చేయగలరని తెలియపరుచుచున్నాను.

షెడ్యూల్ ఆస్తి వివరములు: శ్రీకాకుళంజిల్లా, ఆమదాలవలస సబ్-డి, ఆమదాలవలస మండలం, ఆమదాలవలస మున్సిపాలిటీ, 13వ వార్డు, అక్కివలస రెవెన్యూ గ్రామలెక్క దాఖలా, సర్వే నెం. 197/2 భాగమైనటు వంటిన్నీ, నివేశన ఖాళీ స్థలం కొలతలు వివరం.

తూర్పు పడమరలకు 19 అడుగులు అనగా 5.795 మీ, **ఉత్తర-దక్షిణలకు తూర్పు దిశ** 125 అడుగులు అనగా 38.125 మీ, **ఉత్తర దక్షిణలకు పడమర దిశ** 130 అడుగులు అనగా 39.65 మీ. అనగా 269.16 చ.గ.లు అనగా 224.61 చ.మీ విస్తీర్ణంలో గల స్థలంలో 18x64 = 1152 చ.అ.లలో కట్టబడిన ఆర్.సి.సి. డాబా ఇల్లు, ఆవరణ స్థలంకు డోర్. నెం. 13-2-11 రుగా అసెస్‌మెంటు నెం. 1082005896 రుగా, ఎలక్ట్రికల్ సర్వీసు నెం. 1314071092005242రుగా కలిగినమొత్తం ఆస్తికి హద్దులు: **తూర్పు:** గుంత అప్పారావు గారి తాలూకా ఖాళీ స్థలం, **దక్షిణం:** బొడ్డేపల్లి వీరన్న వగైరాలు ఖాళీ స్థలం, **పడమర:** బలగ రామలచ్చుము గారి ఖాళీ స్థలం, **ఉత్తరం:** రోడ్డు.

అల్లంశెట్టి కిషోర్ కుమార్
Advocate, అరసవల్లి, శ్రీకాకుళం. Cell: 93466 58601, 92466 58601